



# సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
www.saisuryaa.com





ప్రచురణ, హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 65 ఎడిటర్ : పాలగోని రాజేష్ పేజిలు : 8, వెల రూ. 4, /- ఆదివారం - 25 - మే - 2025

## యాపిల్‌నేకాదు.. శాంసంగ్‌నూ టార్గెట్ చేసిన ట్రంప్
# అమెరికాలోనే ఫోన్లను తయారు చేయాలి

మరో దిగ్గజ మొబైల్ ఉత్పత్తుల సంస్థకు కూడా ట్రంప్ ఇదే తరహా హెచ్చరికలు



అమెరికాలో పరికరాలను విక్రయించే ఏ మొబైల్ తయారీ సంస్థకైనా ఈ టారిఫ్ వర్తిస్తుంది

ఇతర దేశాల్లో ఉత్పత్తి చేసినవి తీసుకొస్తే మాత్రం అది అన్యాయమైన ప్రక్రియ.

2లో

## 427 మంది రోహింగ్యాలు జలసమాధి?
# సముద్రంలో మునిగిన రెండు ఓడలు..

మయన్మార్ తీరంలో రెండు ఓడలు మునిగి ఘోర ప్రమాదం



- 427 మంది రోహింగ్యాలు మరణించినట్లు ఐక్యరాజ్యసమితి అంచనా
- మే 9, 10 తేదీల్లో ఈ విషాద ఘటనలు
- ఇది సముద్రంలో జరిగిన అత్యంత
- దారుణమైన ఘటనగా ఐరాస ఆందోళన
- మయన్మార్‌లోని పరిస్థితుల వల్లే రోహింగ్యాల ప్రమాదకర వలసలు

# రాహుల్ గాంధీకి నాన్ బెయిలబుల్ వారెంట్

పరువునష్టం కేసులో జారీ చేసిన జార్ఖాండ్ చైబాసా కోర్టు
జూన్ 26న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశం
2018 లో అమిత్ షాను ఉద్దేశించి రాహుల్ గాంధీ వ్యాఖ్యలు



2లో

ఎంపీ- ఎమ్మెల్యే కోర్టులో పరువునష్టం కేసు దాఖలు చేసిన బీజేపీ నేత



2

## పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి ఎత్తిపోతల పథకం.. అభ్యంతరం తెలిపిన తెలంగాణ

- గోదావరి బోర్డు, పీపీఏకు తెలంగాణ ఇంజనీర్ ఇన్ చీఫ్ లేఖ
- కేంద్ర జలసంఘం అనుమతులు లేవన్న తెలంగాణ
- గోదావరి డెల్టా ప్రయోజనాలకు నష్టమని ఆందోళన




## సర్పంచ్ ఎన్నికలకు
# రెడీ కండి..!

- స్థానిక ఎన్నికలపై అధికారులకు ఆదేశాలు
- 42 శాతం రిజర్వేషన్ రాజకీయంగా ఇస్తాం: సీఎం

## కేంద్రం, రాష్ట్రాలు
## టీం ఇండియాలా కలిసి పనిచేస్తే..
# ఏ లక్ష్యం అసాధ్యం కాదు

- దేశాభివృద్ధిలో అన్ని రాష్ట్రాలు భాగస్వామ్యం కావాలి
- 'అభివృద్ధిలో వేగాన్ని పెంచాల్సిన అవసరం ఉంది
- పాలక మండలి సమావేశం థీమ్ 'వికసిత్ భారత్ కోసం వికసిత్ రాజ్యంఏ2047'
- "వికసిత్ భారత్ అనేది ప్రతి భారతీయుడి లక్ష్యం
- నీతి ఆయోగ్ లో ప్రధాని మోదీ



ఢిల్లీ: ప్రధాని మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, పలువురు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. ఇందులో కీలక వ్యాఖ్యలు చేశారు ప్రధాని మోదీ. కేంద్రం, రాష్ట్రాల ప్రభుత్వాలు టీం ఇండియాలా కలిసి పని చేస్తే సాధించలేని లక్ష్యం అంటూ ఏదీ ఉండదని ఆయన అన్నారు. దేశాభివృద్ధిలో అన్ని రాష్ట్రాలు భాగస్వామ్యం కావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. 'అభివృద్ధిలో వేగాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. కేంద్రం, అన్ని రాష్ట్రాలు టీమ్ ఇండియాలా కలిసి పనిచేస్తే, ఏ లక్ష్యం అసాధ్యం కాదు. పాలక మండలి సమావేశం థీమ్ 'వికసిత్ భారత్ కోసం వికసిత్ రాజ్యంఏ2047'. "వికసిత్ భారత్ అనేది ప్రతి భారతీయుడి లక్ష్యం. ప్రతి రాష్ట్రం వికసిత్ అయినప్పుడు, భారతదేశం వికసిత్ అవుతుంది. ఇది 140 కోట్ల మంది పౌరుల ఆకాంక్ష' అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. నీతి ఆయోగ్.. అత్యున్నత సంస్థ అయిన కౌన్సిల్. ఇందులో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులు సభ్యులుగా ఉంటారు. దేశ ప్రధాని నీతి ఆయోగ్ చైర్మన్ గా వ్యవహరిస్తారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లతో ప్రధాని సమావేశం కావడం ఇదే తొలిసారి. సాధారణంగా, పూర్తి కౌన్సిల్ సమావేశం ప్రతి సంవత్సరం జరుగుతుంది. గతేడాది జూలై 27న నీతి ఆయోగ్ సమావేశం జరిగింది. కౌన్సిల్ మొదటి సమావేశం ఫిబ్రవరి 8, 2015న జరిగింది.



## కవిత లేఖ రిలీజ్ చేసింది వారేనా...?
# కవితను బయటికి పంపేసే కుట్ర జరిగిందా?

కవిత పార్టీ మారుతున్నారని తెలిసి...లేఖ లీక్ చేశారా?
విదేశాల్లో ఉండగా రిలీజ్ చేయాల్సిన అవసరం ఏంటి?
కేటీఆర్ తో విభేదాలు ఉన్నాయా?

సాయిసూర్య- తెలంగాణ డెస్క్: బిఆర్ ఎస్ ఎమ్మెల్సీ, కేసీఆర్ తనయ కవిత లేఖ ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో సంచలనం. తన తండ్రికే కవిత లేఖ ద్వారా పలు అంశాలను చెప్పడం చర్చనీయం. లేఖ పై కవిత క్లారిటీ ఇవ్వడం మరో సంచలనం. ఇక ఈ అంశంపై కాంగ్రెస్, బీజేపీ సహా పార్టీలన్నీ స్పందించడం సర్వసాధారణమే. కానీ ఇన్నాళ్లు బయట వినిపించిన టాక్ నిజమే అని తెలిసేలా చేసింది. ఎమ్మెల్సీ కవితగా కాదు..ఆమె కేసీఆర్ తనయాగా, కేటీఆర్ సహోదరిగా గుర్తింపు. ఆ తర్వాత తెలంగాణ రాజకీయాల్లో.. మిగతా..2లో

## బీఆర్ఎస్ పై నిందలు.. బిల్డర్లతో దందాలు..
# ఢిల్లీ పెద్దలకు చందాలు..



## రేవంత్ పాలనపై మండిపడ్డ కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణ సంపదను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి దోచిపెడుతున్నారని మాజీమంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రం ఏటీఎంగా మారిందని అన్నారు. రేవంత్ రెడ్డి పాలన 'బీఆర్ఎస్ పై నిందలు.. బిల్డర్లతో దందాలు.. ఢిల్లీ పెద్దలకు చందాలు' అన్న చందంగా నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి మాటల మనిషి కాదు మూటల మనిషి అని ఆ పార్టీ నేతలే ఆరోపిస్తున్నారని, అది నిజమని తాజాగా తేలిందని చెప్పారు. ఢిల్లీకి మూటలు మోసి పదవులు కొనుక్కున్నాడని, పీసీసీ చీఫ్ పదవి మిగతా..2లో

# 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ప్రణాళికలు..



## నీతి ఆయోగ్ భేటీలో చంద్రబాబు

వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్రపై నివేదిక

చంద్రబాబు ప్రజంటేషన్‌లోని వివిధ అంశాలు వికసిత్ భారత్‌కు ఉపయోగపడేలా ఉన్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు

ఇతర రాష్ట్రాలు కూడా ఏపీ ప్రతిపాదనలను పరిశీలించాలి

# సిస్టర్‌కు అన్న స్వీట్ వార్నింగ్..!

## పరోక్షంగా కవితను కేటీఆర్ హెచ్చరించారా.?




కవిత లేటర్‌పై కేటీఆర్ స్పందన ఏంటి?
బీఆర్ఎస్‌లో ప్రజాస్వామిక స్ఫూర్తి ఉంది: కేటీఆర్
ముఖ్యమైన విషయం మాట్లాడుతుంటే దెయ్యం, దేవుడు గురించి ఎందుకు?: కేటీఆర్

సాయి సూర్య-తెలంగాణ బ్యూరో: బీఆర్ఎస్ కవిత లేఖ సంచలనం కొనసాగుతుండగానే...కేటీఆర్ స్పదించిన తీరు మరోసారి చర్చనీయాంశం అయ్యింది. కవిత లేఖ బయటికి రిలీజ్ అయిన వేళ కేటీఆర్ ప్రెస్ మీట్ పెట్టడం, పలు అంశాలతో పాటు ఈ లేఖ అంశాన్ని కూడా ప్రస్తావిస్తారని అందరూ అనుకున్నారు. కానీ నేరుగా స్పందించకపోగా..పరోక్షంగా కవిత హెచ్చరికలు చేశారు. లేఖ తానే రాశానని కవిత స్పష్టం చేసినప్పటికీ...ఈ అంశంపై పార్టీ ఎలా స్పందిస్తుందోనని అందరిలో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా కేటీఆర్ స్పందన ఉత్కంఠ రేపింది. మిగతా..2లో







## కవిత లేఖ రిలీజ్ చేసింది వారేనా...?
# కవితను బయటికి పంపేసే కుట్ర జరిగిందా?

మొదటి పేజి తరువాయి

ప్రముఖురాలుగా పరిచయం. కానీ అంతకు మించి... ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఆరోపణలు ఎదుర్కొని.. జైలు పాలు అయిన మహిళగా దేశ వ్యాప్త సంచలనం. జైలు నుంచి వచ్చాక కొన్ని రోజులు రెస్ట్ తీసుకున్న కవిత.. మెల్లి మెల్లిగా యాక్టివ్ అయ్యారు. స్వతంత్రంగా జిల్లా పర్యటనలు చేశారు. కెటిఆర్, హరీష్ రావు ఒక పక్క కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరు సాగిస్తుంటే.. ఇంకో పక్క కవిత తనదైన వ్యూహం తో ముందుకు సాగుతున్నారు. దీంతో ఎవరికి వారే యమున తీరే అన్నట్టుగా పార్టీలో నడుస్తోందని చర్చ జరుగుతోంది. కవిత జైలు నుంచి వచ్చాక ఫ్యామిలీతో కొంత గ్యాప్ వచ్చింది. కెటిఆర్ తో కాస్త దూరం పెరిగిందని చెప్పాలి. ఐతే.. ఆమె జైలు నుంచి బయటికి రావడానికి కేటీఆర్ చేసిన విశ్వ ప్రయత్నాల వల్లే జరిగిందంటారు. కానీ ఆ తర్వాత జరిగిన పరిణామాలు దూరం పెంచినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే...ఇటీవల జిల్లాల పర్యటనలు కవిత చేపట్టడం, కేటీఆర్ కు సమాచారం ఇవ్వకపోవడం, ఆయా నేతలను తన వైపు తిప్పుకుంటున్నారు అనే భావనలో...కొంత దూరం ఏర్పడిందట. ఇదిలా ఉంటే ఈ మధ్య కవిత సీఎం అవుతానంటూ సోది చెప్పించుకోవడం కేటీఆర్ కు మరింత ఇబ్బందికరంగా మారింది. ఇవన్నీ కవిత లెటర్ లీక్ కు కారణంగా చెప్తున్నారు. ఇదిలా ఉంటే.. కవిత కేసీఆర్ కి లేఖ రాయడం అందరినీ ఆశ్చర్య పరిచింది. కేసీఆర్



తో నేరుగా యాక్సెస్ ఉన్న అతి కొద్ది మందిలో ఆమె ఒకరు. ఆమె నేరుగా వెళ్ళి కలిసి.. తాను చెప్పాలనుకున్న విషయం చెప్పేయవచ్చు. అలా కాకుండా లేఖ ద్వారా తెలియజేయడం వెనుక అంతర్యం ఏమిటి..? మిగతా నేతల లానే..కవిత కేసీఆర్ ను కలవలేకపోతున్నారా? అనే సందేహం కలుగుతుంది. ఇక మరో అంశం ఆ లేఖ...ఎవరు బయటికి విడుదల చేశారు అని. అది ఆమె విదేశీ పర్యటన లో ఉండగా రిలీజ్ కావడం. గతంలో చూస్తే ఏ సంఘటనలు అయినా.. సంబంధిత వ్యక్తి.. విదేశాల్లో ఉన్నప్పుడు..సంచలన రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇప్పుడు కూడా అదే జరిగింది. మొత్తంగా బిఆర్ఎస్ లో కవిత లేఖ..పై ప్రస్తుత చర్చ.. ఎక్కడి వరకు వెళ్తుందో చూదాలి.

## 427 మంది రోహింగ్యాలు జలసమాధి?
# సముద్రంలో మునిగిన రెండు ఓడలు..

మయన్మార్ : మయన్మార్ తీర ప్రాంతంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. రోహింగ్యా శరణార్థులతో వెళ్తున్న రెండు ఓడలు మునిగిపోయాయి. ఈ ఘోర దుర్ఘటనల్లో సుమారు 427 మంది ప్రాణాలు కోల్పోయి ఉంటారని ఐక్యరాజ్య సమితి (ఐరాస) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వార్త నిజమైతే, ఇటీవలి కాలంలో సముద్రంలో జరిగిన అతి పెద్ద విషాదాల్లో ఒకటిగా ఇది నిలిచిపోతుందని ఐరాస పేర్కొంది. ఐక్యరాజ్య సమితి అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం, మే 9వ తేదీన జరిగిన మొదటి ప్రమాదంలో ఒక నౌక మునిగిపోయింది. ఇందులో ప్రయాణిస్తున్న 267 మందిలో కేవలం 66 మంది మాత్రమే ప్రాణాలతో బయటపడి ఉంటారని తెలిపింది. మిగిలిన వారు గల్లంతయ్యారు. ఆ తర్వాత మే 10వ తేదీన మరో నౌక కూడా ఇదే విధంగా ప్రమాదానికి గురైంది. ఈ రెండో నౌకలో ఉన్న వారిలో 21 మంది మాత్రమే సురక్షితంగా ఒడ్డుకు చేరారని సమాచారం. ఈ రెండు ఘటనల్లో కలిపి మొత్తం 427 మంది మరణించి ఉండవచ్చని ఐరాస అంచనా వేస్తోంది. ఈ ప్రమాదాలకు గల కచ్చితమైన కారణాలపై ఐరాసకు అనుబంధంగా పనిచేస్తున్న శరణార్థి విభాగం విశ్లేషణ జరుపుతున్నట్లు సమాచారం. మయన్మార్‌లో నివసించే రోహింగ్యాలు అనేక సంవత్సరాలుగా వివక్షకు, హింసకు గురవుతున్నారు. 2017లో మయన్మార్ సైన్యం చేపట్టిన కఠిన చర్యల కారణంగా లక్షలాది మంది రోహింగ్యాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌కు వలస వెళ్లారు. అక్కడ ఏర్పాటు చేసిన శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. అయితే, గత ఏడాది మయన్మార్‌లో సైనిక తిరుగుబాటు జరిగిన అనంతరం, రోహింగ్యాలపై దాడులు, అణచివేత మరింత పెరిగాయని వార్తలు వస్తున్నాయి. దీంతో, బంగ్లాదేశ్‌లోని శిబిరాల్లో ఇప్పటికే కిక్కిరిసిపోయిన జనాభా, అక్కడి దుర్భర పరిస్థితుల కారణంగా అనేకమంది రోహింగ్యాలు ఇతర దేశాలకు వలస వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే, వారు ఏజెంట్ల మాటలు నమ్మి, ప్రమాదకరమైన సముద్ర మార్గాల ద్వారా ఇండోనేషియా, మలేషియా వంటి దేశాలకు చేరుకోవాలని చూస్తున్నారు. ఇలాంటి ప్రయాణాల్లోనే తరచూ ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

## ఉగ్రవాద దాడుల్లో 20వేల మంది
# భారతీయుల మృతి..
### ఐక్యరాజ్యసమితిలో మరోమారు పాక్‌ను ఎండగట్టిన భారత్

ఢిల్లీ: గత నెల 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన పాశవిక ఉగ్రవాద దాడి తర్వాత తాత్కాలికంగా రద్దు చేయబడిన సింధు జలాల ఒప్పందంపై పాకిస్థాన్ "తప్పుడు సమాచారం" అందించిందని భారత్ తీవ్రంగా విమర్శించింది. పాకిస్థాన్ ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదం కారణంగా 65 ఏళ్ల నాటి ఒప్పందాన్ని నిలిపివేసినట్లు ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి పర్వతనేని హరీశ్ తెలిపారు. పాక్ ప్రతినిధి ఐక్యరాజ్యసమితిలో ఈ ఒప్పంద అంశాన్ని లేవనెత్తారు. "నీరు ప్రాణం, యుద్ధ ఆయుధం కాదు" అని అన్నారు. దీంతో రాయబారి హరీశ్ ఘాటుగా స్పందించారు. 1960లో సంతకం చేసిన ఈ ఒప్పందాన్ని ఏప్రిల్ 22న పహల్గామ్ దాడిలో 26 మంది మరణించిన ఒక రోజు తర్వాత భారత్ నిలిపివేసింది. ఈ భయంకరమైన ఉగ్రదాడికి సరిహద్దు సంబంధాలు ఉన్నట్లు కనుగొన్న తర్వాత భారత ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆయన స్పష్టం చేశారు. "ఆరున్నర దశాబ్దాలుగా భారతదేశంపై పాకిస్థాన్ మూడు యుద్ధాలు, వేలాది ఉగ్రవాద దాడులను చేయడం ద్వారా సింధు జలాల ఒప్పందం స్ఫూర్తిని ఉల్లంఘించింది. గత నాలుగు దశాబ్దాలలో ఉగ్రవాద దాడుల్లో 20,000 మందికి పైగా భారతీయులు మరణించారు. భారత్‌లో పాక్ ప్రభుత్వ ప్రాయోజిత సరిహద్దు ఉగ్రవాదం పౌరుల జీవితాలను, మత సామరస్యాన్ని, ఆర్థిక శ్రేయస్సును ప్రశ్నార్థకంగా మార్చేసింది. 2012లో జమ్మూకాశ్మీర్‌లోని తుల్బుల్ నావిగేషన్ ప్రాజెక్టుపై కూడా ఉగ్రవాదులు దాడి చేశారు. పాక్ కుట్రపూరిత చర్యలు మా ప్రాజెక్టుల భద్రతకు, పౌరుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తూనే ఉన్నాయి. గత రెండు సంవత్సరాలలో అనేక సందర్భాల్లో సవరణలను చర్చించాలని భారత్ అధికారికంగా పాక్‌ను కోరింది. కానీ, దాయాది దేశం వీటిని తిరస్కరిస్తూనే ఉంది. భారతదేశం చట్టబద్ధమైన హక్కులను పూర్తిగా ఉపయోగించుకోకుండా పాకిస్థాన్ అడ్డంకి ధోరణి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ ఉగ్రవాదానికి కేంద్రంగా ఉన్న పాకిస్థాన్... సరిహద్దు ఉగ్రవాదానికి తన మద్దతును విశ్వసనీయంగా, పూర్తిగా ముగించే వరకు ఈ ఒప్పందం నిలిపివేయబడుతుంది" అని హరీశ్ వివరించారు. పహల్గామ్ దాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ పాశవిక దాడికి ప్రతీకారంగా భారత సైన్యం మే 7న 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించింది. పాక్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది ప్రాంతాల్లో ఉగ్రవాద శిబిరాలపై క్షిపణి దాడులతో విరుచుకుపడింది. ఆ తరువాత పాకిస్థాన్ భారీ క్షిపణి, డ్రోన్ దాడిని ప్రారంభించింది. కానీ వాటిని భారత బలగాలు తిప్పికొట్టాయి. పాక్ దాడులకు ప్రతీకారంగా భారత దళాలు పాకిస్థాన్‌లోని వైమానిక స్థావరాలపై దాడి చేశాయి. ఈ క్రమంలో మే 10న ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో ఉద్రిక్తతలకు తెరపడింది.

# బీఆర్ఎస్ పై నిందలు.. బిల్డర్లతో దందాలు.. ఢిల్లీ పెద్దలకు చందాలు..

మొదటి పేజి తరువాయి



ఢిల్లీకి మూటలు మోసి పదవులు కొనుక్కున్నాడని, పీసీసీ చీఫ్ పదవి కోసం రూ.50 కోట్లు చెల్లించాడని కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి గతంలో ఆరోపించారని కేటీఆర్ గుర్తుచేశారు. నేషనల్ హెరాల్డ్ వ్యవహారంలో రేవంత్ రెడ్డిపై వచ్చిన ఆరోపణలపై కేటీఆర్ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ డీఎన్ఏలోనే కరప్షన్ ఉందని తీవ్ర ఆరోపణలు చేశారు. నీతి, నిజాయితీ ఉంటే రేవంత్ రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తిపై అవినీతి ఆరోపణలు వస్తే దర్యాప్తు పారదర్శకంగా జరగాలంటే పదవి నుంచి తప్పుకోవాలని ఇదే కాంగ్రెస్ లీడర్లు కర్ణాటకలో డిమాండ్ చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ డిమాండ్లకు స్పందించిన యడియూరప్ప అప్పట్లో తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సంచలన ఆరోపణలు చేసిందని కేటీఆర్ గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ గా ఉన్న సమయంలో ఆయన సూచనల మేరకే 'యంగ్ ఇండియన్' కంపెనీకి డొనేషన్లు ఇచ్చామని కాంగ్రెస్ నేతలు చెప్పారని ఈడీ వెల్లడించిందన్నారు. రేవంత్ సూచనతో, నెల రోజుల వ్యవధిలో యంగ్ ఇండియన్ కంపెనీకి రూ.80 లక్షల వరకు బదిలీ చేసినట్లు ఈడీ ఆరోపించిందన్నారు. ఈ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగాలంటే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటుకు నోటు కేసును తెలంగాణ ప్రజలు ఇంకా మర్చిపోలేదని కేటీఆర్ చెప్పారు. ఈ కేసు తర్వాత రేవంత్ రెడ్డి మారిపోయాడని తాము భావించామన్నారు. అయితే, కుక్క తోక వంకర, దానిని ఎవరూ సరిచేయలేరన్నట్లు ఆయన మారలేదని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# రాహుల్ గాంధీకి నాన్ బెయిలబుల్ వారెంట్

ఢిల్లీ: లోక్ సభ ప్రతిపక్ష నేత, వయనాడ్ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి జార్ఖండ్‌లోని చైబాసా ఎంపీ-ఎమ్మెల్యే కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. 2018 నాటి పరువు నష్టం దావా కేసులో ఈ వారెంట్ ఇచ్చింది. జూన్ 26న వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని రాహుల్ గాంధీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ రాహుల్ గాంధీ తరఫు న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది.

### రాహుల్ పై కేసు ఇదే..

2018లో కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాను ఉద్దేశించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. "హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి కూడా బీజేపీకి అధ్యక్షుడు కాగలడు" అని రాహుల్ వ్యాఖ్యానించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యాఖ్యలు బీజేపీ కార్యకర్తలందరినీ అవమానించేలా ఉన్నాయని, పరువు నష్టం కలిగించాయని ఆరోపిస్తూ బీజేపీ నేత ప్రతాప్ కతియార్ 2018 జులై 9న చైబాసా చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (సీజేఎం) కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తదనంతర కాలంలో, జార్ఖండ్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ పరువు నష్టం కేసును 2020 ఫిబ్రవరిలో రాంచీలోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టుకు బదిలీ చేశారు. ఆ తర్వాత మళ్లీ ఈ కేసు చైబాసాలోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టుకు బదిలీ అయింది. ఈ కేసును విచారణకు స్వీకరించిన మేజిస్ట్రేట్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేశారు.

### కోర్టుకు హాజరు కాని రాహుల్..

కోర్టు పలుమార్లు సమన్లు జారీ చేసినప్పటికీ రాహుల్ గాంధీ విచారణకు హాజరుకాలేదు. దీంతో తొలుత ఆయనపై బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. ఈ వారెంట్‌పై స్టే విధించాలని కోరుతూ రాహుల్ గాంధీ జార?ండ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను 2024 మార్చి 20న హైకోర్టు కొట్టివేసింది. అనంతరం, వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరుతూ రాహుల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా చైబాసా కోర్టు తిరస్కరించింది. తాజాగా, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించిన ప్రత్యేక న్యాయస్థానం నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తూ, జూన్ 26న విచారణకు హాజరుకావాలని ఆదేశించింది.

# 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ప్రణాళికలు..

దిల్లీ: నీతి ఆయోగ్ సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు.. వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్రపై నివేదిక ఇచ్చారు. పహల్గాం ఉగ్ర దాడిని ఖండిస్తూ.. ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసిస్తూ చంద్రబాబు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని వివరించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే అంశాలను తన ప్రజంటేషన్‌లో ప్రస్తావించారు. చంద్రబాబు ప్రజంటేషన్‌లోని వివిధ అంశాలు వికసిత్ భారత్‌కు ఉపయోగపడేలా ఉన్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా ఏపీ ప్రతిపాదనలను పరిశీలించాలని సూచించారు. చంద్రబాబు ప్రజంటేషన్‌కు సమావేశంలో పెద్ద ఎత్తున ప్రశంసలు దక్కాయి. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తన ప్రజంటేషన్‌లో చంద్రబాబు వివరించారు. 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ఏపీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్టు వెల్లడించారు. వికసిత్ భారత్ కల సాకారంతో స్వర్ణాంధ్రను సాధించేలా అడుగులు వేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న వనరులను తాము ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నామనే విషయాన్ని తన ప్రజంటేషన్‌లో వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విశాఖను తీర్చిదిద్దనున్నట్లు సీఎం వెల్లడించారు. విశాఖకు గ్లోబల్ హంగులు అద్దేలా నాలుగు జోన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వివరించారు. విశాఖ మోడల్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలని కోరారు. డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా గూగుల్ ఏ1 వంటి టెక్నాలజీలను వినియోగిస్తున్నట్టు చంద్రబాబు చెప్పారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నట్టు స్పష్టం చేశారు.

## తెలంగాణ రైజింగ్-2047కు
# కేంద్రం సహకారం అవసరం



ఢిల్లీ: వికసిత్ భారత్ కు అనుగుణంగా 'తెలంగాణ రైజింగ్ 2047' అనే నినాదంతో మా రాష్ట్ర కార్యచరణ పథకాన్ని సమర్పిస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. శనివారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన శనివారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడిన సీఎం.. మా ఆకాంక్షలు, దృఢ సంకల్పానికి ఈ రోడ్డు మ్యాప్ ప్రతిబింబం అన్నారు. ఇంత సాహసోపేతమైన మార్పును సాధించాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం, భాగస్వామ్యం అత్యంత అవసరం. ఈ విషయంలో సహకార సమాఖ్య స్ఫూర్తితో కలిసి పని చేయాలని మేం ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల సమగ్ర, స్థిరమైన అభివృద్ధితోనే వికసిత్ భారత్ సాకారం అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దేశ పురోభివృద్ధి ప్రతి రాష్ట్రం కేంద్ర పాలిత ప్రాంతం అభివృద్ధితో ముడిపడి ఉంటుంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆయా ప్రాంతాలకు మద్దతుగా నిలవడంతో పాటు ఆయా రాష్ట్రాల సామర్థ్యాలను ఉపయోగించుకోవడం అత్యవసరం అన్నారు. వెనుకబడిన రాష్ట్రాలకు అవసరమైన ప్రతి సహాయాన్ని అందించాలని జాతీయ వృద్ధిలో సమతుల్యత చాలా కీలకం అన్నారు. ఈ రోజు మనం చేసే చర్చలు దేశ ప్రజల అభివృద్ధి, సంక్షేమంపై దీర్ఘకాల ప్రభావం చూపుతాయని చెప్పారు. ట్రిలియన్ డాలర్ల జీఎస్ డీపీ సాధించే రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మొదటి స్థానంలో ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. జాతీయ స్థాయి అంచనాల ప్రకారం ఈ లక్ష్యం 15 ఏళ్లలో సాధ్యమవుతుందని భావిస్తున్నాం. కానీ ఈ వచ్చే పదేళ్లలోనే ఈ లక్ష్యాన్ని సాధించాలనే సంకల్పంతో తెలంగాణ ఉందన్నారు. ఇది కేవలం కోరిక మాత్రమే కాదని వ్యూహాత్మక ప్రణాళిక, స్పష్టమైన దిశతో ముందుకు సాగుతున్న లక్ష్యం అన్నారు. ప్రతి ఆరేళ్లకు ఒక సారి మా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని రెట్టింపు చేసే సామర్థ్యాన్ని మేం స్థిరంగా కొనసాగించామని ఇదే ఊపుతో ప్రస్తుత దశాబ్దంలోనే మా జీఎస్ డీపీని ఐదు రెట్లు విస్తరించడంపై దృష్టి సారించామన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 లో మహిళా సాధికారత కీలకం అని అందుకే మా ప్రభుత్వం మహిళా స్వావలంబన, పెట్టుబడులు, చలనశీలత, ఆర్థికాభివృద్ధిని దన్నుగా నిలిచే పథకాలను రూపొందించామన్నారు.

## యాపిల్‌నేకాదు.. శాంసంగ్‌నూ టార్గెట్ చేసిన ట్రంప్
# అమెరికాలోనే ఫోన్లను తయారు చేయాలి

అమెరికా: ప్రముఖ ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ కి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. అమెరికాలోనే ఫోన్లను తయారు చేయాలని చెప్పారు. లేదంటే 25శాతం సుంకాన్ని విధిస్తామంటూ తీవ్రంగా హెచ్చరించారు. అయితే, మరో దిగ్గజ మొబైల్ ఉత్పత్తుల సంస్థకు కూడా ట్రంప్ ఇదే తరహా హెచ్చరికలు చేశారు. యాపిక్ ప్రత్యర్థి, దక్షిణ కొరియాకు చెందిన దిగ్గజ మొబైల్ సంస్థ శాంసంగ్ తమ ఉత్పత్తులను అమెరికాలోనే తయారు చేయాలని స్పష్టం చేశారు. లేదంటే 25 శాతం దిగుమతి సుంకాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వైట్‌హౌస్‌లో విలేకరులతో ట్రంప్ మాట్లాడుతూ.. అమెరికాలో పరికరాలను విక్రయించే ఏ మొబైల్ తయారీ సంస్థకైనా ఈ టారిఫ్ వర్తిస్తుందని స్పష్టం చేశారు. 'యాపిల్ ఒక్కటే కాదు.. శాంసంగ్ అయినా.. ఇంకే సంస్థ అయినా తమ ఉత్పత్తులను అమెరికాలోనే తయారు చేయాలి. అలాకాకుండా ఇతర దేశాల్లో ఉత్పత్తి చేసినవి తీసుకొస్తే మాత్రం అది అన్యాయమైన ప్రక్రియ. అమెరికాలో పరికరాలను విక్రయించే ఏ మొబైల్ తయారీ సంస్థ అయినా.. ఇక్కడ ప్లాంట్ నిర్మిస్తే ఎలాంటి టారిఫ్‌లు ఉండవు. లేదంటే 25 శాతం దిగుమతి సుంకాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని ట్రంప్ స్పష్టం చేశారు. దక్షిణ కొరియాకు చెందిన దిగ్గజ మొబైల్ సంస్థ శాంసంగ్.. అమెరికా మార్కెట్లో నంబరు 2 విక్రేతగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఈ కంపెనీ ఏటా 220 మిలియన్ ఫోన్లను విక్రయిస్తుండగా.. ఇందులో 60శాతం మొబైల్స్‌ను వియత్నాంలో ఉత్పత్తి చేస్తున్నారు. ఇక్కడి నుంచే ఎక్కువగా అమెరికాకి ఎగుమతి అవుతున్నాయి. మరోవైపు కౌంటర్ పాయింట్ రీసెర్చ్ ప్రకారం.. 2024లో భారత్‌లో తయారు చేసిన మొత్తం స్మార్ట్‌ఫోన్లలో యాపిల్, శాంసంగ్ 94 శాతం వాటా కలిగి ఉన్నాయి. 2025 మార్చి త్రైమాసికంలో భారత్‌లో శాంసంగ్ మార్కెట్ వాటా 17 శాతంగా ఉంది.

# 'సిస్టర్ స్ట్రోక్'తో కేటీఆర్ చిన్న మెదడు దెబ్బతిన్నది

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపైన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైన చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ప్రతిస్పందించారు. కేటీఆర్ ఆరోపణలను తిప్పికొడుతూ, ఆయనపై ఘాటైన విమర్శలు చేశారు. సచివాలయంలో మీడియాతో సీతక్క మాట్లాడుతూ, "సిస్టర్ స్ట్రోక్ దెబ్బకు కేటీఆర్‌కు చిన్న మెదడు చితికిపోయింది" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు తీసుకున్నప్పుడు లేని భయం, ఇప్పుడు విచారణ కమిషన్ ముందుకు రావడానికి ఎందుకని కేటీఆర్‌ను ఆమె సూటిగా ప్రశ్నించారు. గోబెల్స్ తరహా ప్రచారంలో కేటీఆర్‌ను మించిన వారు లేరని, ఆయనకు "గోబెల్స్ అవార్డు" ఇవ్వాలని ఎద్దేవా చేశారు. "అబద్ధాల పునాదుల మీదే బీఆర్ఎస్ పార్టీ నడుస్తోంది. గోబెల్స్‌ను కూడా కేటీఆర్ మించిపోయారు. కవిత చెప్పిన దెయ్యం బహుశా కేటీఆరే కావొచ్చు," అని సీతక్క వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి, అర్హత కేటీఆర్‌కు లేవని ఆమె అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోయినప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉంది బీఆర్ఎస్ కాదా అని నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు పొందడం కోసమే కేటీఆర్ పదేపదే ఈడీ ప్రస్తావన తెస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే ఆయనపై కేసు నమోదు చేశారని గుర్తుచేశారు. యుద్ధంలో ట్రంప్ అనుసరించే నీతిని మోదీ అమలు చేస్తున్నారని, అబద్ధాన్ని నిజం చేయడం కోసం కేటీఆర్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను కేటీఆర్ పూర్తిగా విస్మరించారని మంత్రి సీతక్క అన్నారు.

రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలపై అనవసరమైన, తప్పుడు విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. "మీకు నిజంగా నీతి, నిజాయితీ ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకు కూలేశ్వరం అయిందో ప్రజలకు సమాధానం చెప్పండి" అని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన పత్రికకు (నేషనల్ హెరాల్డ్ ఉద్దేశించి) సహాయం చేస్తే తప్పేంటని ప్రశ్నించిన ఆమె, "గులాబీ కూలీల" రూపంలో దోచుకున్న వేల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని నిలదీశారు.

## పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి
## ఎత్తిపోతల పథకం.. అభ్యంతరం తెలిపిన తెలంగాణ

హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఆంధ్రప్రదేశ్ చేసిన ప్రతిపాదనలపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ గోదావరి బోర్డుతోపాటు, పోలవరం ప్రాజెక్టు అథారిటీకి లేఖ రాశారు. ఎత్తిపోతల పనులు ఆపినట్లు ఏప్రిల్ 8న జరిగిన పీపీఏలో పోలవరం చీఫ్ ఇంజినీర్ తెలిపినా.. ఈ ఆర్థిక సంవత్సరంలోనే పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఏపీ సిద్ధమైందని లేఖలో పేర్కొన్నారు. కేంద్ర జల సంఘం అనుమతి లేకుండా ఈ ప్రాజెక్టు చేపడుతున్నారని, దీనివల్ల గోదావరి డెల్టా వ్యవస్థ ప్రయోజనాలకు కూడా నష్టం వాటిల్లుతుందని లేఖలో పేర్కొన్నారు. ప్రధానంగా పోలవరం డెడ్ స్టోరేజీ నుంచి నీటిని ఎత్తిపోయడం సబబు కాదని అన్నారు. తెలంగాణ చేపడుతున్న ప్రతి ప్రాజెక్టుకూ నీటి లభ్యత లేదంటూ ఏపీ ప్రభుత్వం అభ్యంతరం చెబుతోందని, మరోవైపు ఆంధ్రప్రదేశ్ మాత్రం డెడ్ స్టోరేజీ నుంచి కొత్తగా ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించడం సబబు కాదని అనిల్‌కుమార్ లేఖలో పేర్కొన్నారు. డెడ్ స్టోరేజీ నుంచి ఎత్తిపోతల చేపట్టడం సీడబ్ల్యూసీ అనుమతులకు విరుద్ధమని తెలంగాణ వాదిస్తోంది. సీడబ్ల్యూసీ వెంటనే జోక్యం చేసుకొని ఏపీని అడ్డుకోవాలని అనిల్‌కుమార్ కోరారు. పోలవరం నుంచి ఎత్తిపోతల చేపట్టకుండా చూడాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకు గతంలో కేంద్ర జల సంఘం ఇచ్చిన అనుమతులకు కూడా ఇది విరుద్ధంగా ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు. తక్షణమే గోదావరి నదీ యాజమాన్య బోర్డుతోపాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ జోక్యం చేసుకొని ఈ ప్రాజెక్టుపై ఏపీ ముందుకు వెళ్లకుండా నిలువరించాలని కోరారు.

# సర్పంచ్ ఎన్నికలకు రెడీ కండి..!
### స్థానిక ఎన్నికలపై అధికారులకు ఆదేశాలు
### 42 శాతం రిజర్వేషన్ రాజకీయంగా ఇస్తాం: సీఎం
### త్వరలో షెడ్యూల్ ప్రకటించే అవకాశం




సాయి సూర్య- తెలంగాణ బ్యూరో: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు? ఇంకా ఎన్ని రోజులు వెయిట్ చేయాలి.? బలం కూడగట్టుకొని ఎన్ని రోజులు వెయిటింగ్ లో ఉండాలి.? ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందా? లేదా? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానం కోసం ఎంతో మంది ఎదురు చూస్తున్నారు. ఈ నిరీక్షణ త్వరలో ముగియనుంది. రాష్ట్రంలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవి కాలం ముగిసి చాలా నెలలు గడిచింది. ప్రభుత్వం మారిపోవడం, ఎన్నికల నిర్వహణ ఆలస్యానికి కారణం అయింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎన్నికల హామీల అమలులో భాగంగా..రిజర్వేషన్ల అంశంపై కాస్త టైమ్ తీసుకుంది. ఇచ్చిన హామీ ప్రకారం బీసీ రిజర్వేషన్స్ కోసం కమిటీ ఏర్పాటు, రిపోర్టు ఇవ్వడం, అసెంబ్లీ ఆమోదించడం జరిగాయి. ఐతే.. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల తీర్మానం కేంద్రం ఆమోదించాల్సి ఉంది. కేంద్రం ఆమోదం తెలిపితే.. 42 శాతం రిజర్వేషన్ కల్పించే అవకాశం ఉంది. వీటన్నిటినీ ఆలోచించి.. ఇన్నాళ్లు వాయిదా వేస్తూ వచ్చింది. కానీ..ఇప్పుడు మరింత ఆలస్యం చేస్తే.. మొదటికే మోసం వస్తుందని.. ఆలోచనలో ఉంది. దీంతో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం 42 శాతం రిజర్వేషన్లకు అనుమతించకపోతే.. రాజకీయంగా 42 శాతం సీట్లు ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు.

చూదాలి మరి.. ఎప్పుడు ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తారో ...

# సిస్టర్‌కు అన్న స్వీట్ వార్నింగ్..!

మొదటి పేజి తరువాయి

ఈ క్రమంలో ప్రెస్ మీట్ లో అన్ని అంశాలకు సమాధానం దొరుకుతుందని అందరూ భావించారు. కానీ అలాంటిది ఏమి జరగలేదు. కేటీఆర్ ప్రెస్ మీట్ లో పరోక్షంగా కవితకు వార్నింగ్ ఇచ్చారని విశ్లేషకులు అంటున్నారు. అంతర్గత విషయాలు బయటమాట్లాడకపోతేనే మంచిదని కవితను పరోక్షంగా హెచ్చరించారు. బీఆర్ఎస్ లో ఎవరైనా సూచనలు ఇవ్వొచ్చు..లేఖలు రాయొచ్చని చెప్పారు. బీఆర్ఎస్ లో ప్రజాస్వామిక స్ఫూర్తి ఉందన్నారు. గతంలోనూ అధినేతకు లేఖలు రాసిన వారు ఉన్నారని చెప్పారు.అన్ని పార్టీల్లో కోవర్టులు ఉంటారని.. తమ పార్టీలోనూ రేవంత్ కోవర్టులు ఉండొచ్చని వ్యాఖ్యానించారు కేటీఆర్. పార్టీలో అందరం కార్యకర్తలమే..అందరూ సమానమేనన్నారు. కవిత అంశంపై ప్రెస్ మీట్ లో కేటీఆర్ మాట్లాడలేదు. అసలు ఆ ఊసే ఎత్తలేదు. కానీ విలేకర్లు కవిత అంశంపై ప్రశ్నలు సంధించారు. పదే పదే అడిగినప్పటికీ కేటీఆర్ ఆచితూచి వ్యవహరించారు. తాను ప్రెస్ మీట్ పెట్టాలనుకున్న అంశంపైనే అడగాలని కోరారు. కానీ చివరకు కేటీఆర్ స్పందించక తప్పలేదు. ఐతే పరోక్షంగా కవితపై కామెంట్లు చేశారు. ముఖ్యమైన





విషయం మాట్లాడుతుంటే దెయ్యం,దేవుడు గురించి ఎందుకని కేటీఆర్ ప్రశ్నించారు. ఇప్పటికే కవిత లేఖతో వారి మధ్య అంతర్గతంగా విభేదాలు ఉన్నాయని స్పష్టమైందని కాంగ్రెస్, బీజేపీ అంటున్నాయి. కవిత బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోతారంటూ ప్రచారం చేస్తున్నాయని...ఈ క్రమంలో కవిత లేఖపై కేటీఆర్ వివరణ ఇస్తారనుకుంటే...పక్కన పెట్టేయడం అనేక ప్రశ్నలు లెవనెత్తింది. నిజంగా కేసీఆర్ కుటుంబంలో అంతర్గత కలహాలు ఉన్నాయా? అనే చర్చ జరుగుతోంది.

## మండల మహిళా సమాఖ్యలో సంఘాల ఆర్థిక లావాదేవీలు,రికార్డుల తనిఖీ



ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 24: ఇబ్రహీంపట్నం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాలకు 2024- 2025 సంవత్సరానికిగాను ఆర్థిక లావాదేవీలు నిర్వహించిన పుస్తకాల ఆడిట్ సెర్ప్ ఆఫీసు నుండి కేటాయించిన సీబీఓ ఆడిటర్లు మధు, శ్రీనివాస్ ద్వారా నిర్వహించడం జరిగినది. ఈఆడిట్ కు డి ఆర్ డి ఓ కార్యాలయం నుండి అడిషనల్ డి ఆర్ డి ఓ సూర్యారావు హాజరై గ్రామ సంఘాలద్వారా నిర్వహించిన పుస్తకాలను పరిశీలన చేసి, వివోఏ లతో నెలవారి పొదుపులు, ఇచ్చిన అప్పుల వసూళ్లు, సమావేశాల నిర్వహణ, మొండి బకాయి సభ్యుల వివరాలు, సిఐఎఫ్ అప్పుల వసూళ్ల గురించి, శ్రీనిధి రీపేమెంట్స్ విషయాల్లో, నెలవారీగా పుస్తకాలు రాయడం గురించి, మాట్లాడారు. అదేవిధంగా సిబ్బందికి టీమ్ మీటింగు నిర్వహించి మీటింగ్ నందు ఈ సంవత్సరానికి సంబంధించిన (2025 -2026) బ్యాంకు లింకేజీ టార్గెట్, అచీవ్మెంట్ గురించి, పి ఎం జె జె బి వై, పి ఎం ఎస్ బి వై ఇన్సూరెన్స్ మహిళా సంఘాల సభ్యులకు కొత్తవి, పాతవి రెన్యువళ్ళు చేయించడం, స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్ గురించి, లోకోస్ యాప్ డాటా ఎంట్రీ, అజివిక రిపోర్టు గురించి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యాలయం నుండి డిపిఎం(ఎఫ్ ఐ) బాల్ రాజ్ , డిపిఎం (ఫైనాన్స్) యాదయ్య హాజరయ్యారు. అదేవిధంగా ఏపీఎం పి. రవీందర్, సీసీలు నర్సింహ్మా,కృష్ణయ్య, చంద్రిక,ఆనంద్ కుమార్, జంగమ్మ, రమాదేవి, ఎమ్మెస్ సిబ్బంది, వివో ఏలు హాజరయ్యారు.


### నేడు గ్రామ పాలన అధికారి పరీక్షలు

## పకడ్బందీగా నిర్వహించాలి

సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్.



రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, సూర్యా టుడే న్యూస్ ప్రతినిధి మే 24 : గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. శనివారం సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ గ్రామ పాలన అధికారి పరీక్షల నిర్వహణ పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, మే 25 ఆదివారంనాడు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే గ్రామ పాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలో నోడల్ అధికారి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటల వరకు జవాబు పత్రాలను, 9.20 గంటల వరకు ప్రశ్నా పత్రాలను తరలించాలని సూచించారు. పరీక్షలు ముగిసిన తర్వాత జవాబు పత్రాలను సరిగ్గా సీల్ చేసి జేఎన్టియూహెచ్ కు అందించాలని, ఉపయోగించని జవాబు పత్రాలను కూడా తప్పనిసరిగా పరీక్ష కేంద్రాల నుంచి సేకరించాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీటింగ్ అరేంజ్మెంట్స్ పక్కాగా ఉండాలని, అభ్యర్థులకు అవసరమైన త్రాగునీరు, ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని అన్నారు . పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మేర ఇన్విజిలేటర్లను నియమించాలని, అభ్యర్థులు ఏ విధమైన ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచీలు తీసుకురావద్దని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో మెడికల్ టీం ఏర్పాటు చేయాలని, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాల రూట్ లలో అవసరమైన బస్సులను నడపాలని అన్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ పక్కల జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, కలెక్టరేట్ ఏ.ఓ. సునీల్ తదితరులు పాల్గొన్నారు.



### వివాహ వేడుకల్లో జీవన్-నెహాలను ఆశీర్వదించిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు



మంచాల, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 24: మంచాల మండలం కేంద్రంలోని దండేటి కార్ శర్వంజీ పంక్షన్ హాల్లో జరిగిన ఆరుట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పంబాల బుగ్గరాములు సోదరుడి.కుమారుడి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులు జీవన్- నేహా లను ఆశీర్వదించిన మాజీ పిసిసి సభ్యుడు పాశం లక్ష్మీపతి గౌడ్,మంచాల వ్యవసాయ సహకార సంఘం బ్యాంక్ చైర్మన్ వెదిరే హన్మంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం కిసాన్ సెల్ అధ్యక్షుడు కావలి బుగ్గరాములు ముదిరాజ్, ఆరుట్ల గ్రామమాజీ సర్పంచ్ సుంకరి.పాండరీనాథ్ గౌడ్, సహకార బ్యాంక్ డైరెక్టర్ జెనిగె వెంకటేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు కావాలి శ్రీనివాస్ ముదిరాజ్, ఎద్మనరేందర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం మాజీ అధ్యక్షుడు ముచర్లవెంకటేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామ శాఖ అధ్యక్షుడు రావుల భాష కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాదగోని రాజయ్య గౌడ్, మాధగోని జంగయ్య గౌడ్, యండి.యూసుఫ్,యూత్ కాంగ్రెస్ నాయకుడు సుంకరి జయంత్ గౌడ్,మంచాల మండలం వైయస్ అర్ యువ సేనా నాయకుడు లొంగరీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### ఈనెల 27 నుండి సాయి సన్నిధిలో

## 18వ వార్షికోత్సవ కార్యక్రమాలు



చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 24: చింతపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ - నాగార్జునసాగర్ రహదారిపై గత 18 సంవత్సరాల క్రితం దాతల సహకారంతో కొలువుదిన సాయి సన్నిధిలో ఈనెల 27 నుండి స్వామివారి పద్దెనిమిదవ వార్షికోత్సవ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు సాయి సన్నిధిలో సర్వం సమకూరుస్తున్నారు. గత 18 సంవత్సరాల నుండి ప్రతి ఏటా స్వామివారి వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సంవత్సరం కూడా వేలాది మంది సాయి భక్తుల నడుమ వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించడం కోసం ఆలయ కమిటీ చైర్మన్ మంచి కంటి ధనంజయ ఆధ్వర్యంలో సకల సౌకర్యాలు సమకూరుస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని మరో షిరిడి సాయి దేవాలయంగా సాయిబాబా దేవాలయం భక్తులకు దర్శనమిస్తుంది. ప్రతినిత్యం వేలాది మంది భక్తులతో దేవాలయం దినదినాభివృద్ధి చెందుతుంది. అదేవిధంగా వేలాది పశువులతో గోశాల సాయి సన్నిధిలో నిర్వహించడం జరుగుతుంది. సాయి సన్నిధిలో 18వ వార్షికోత్సవ కార్యక్రమాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు హాజరుకానున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పేర్కొన్నారు. స్వామి సన్నిధిలో ప్రతినిత్యం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాల్లో అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ముక్కామల పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ శ్రీధర స్వామీజీ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. శ్రీధర స్వామీజీ ఆధ్వర్యంలో చండి ఉపాసకులు కొడకొండ్ల శ్రీరామ్ చరణ్ శర్మ, బ్రహ్మశ్రీకొండ కొండుడ్ల శివకుమార్ శర్మ, నిర్వహణలో శాస్త్రోత్తగంగా. పూజా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమాలకు వేలాదిమంది సాయి భక్తులు హాజరై స్వామి కృపకు ప్రార్థులు కాగలరని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రధాన కార్యదర్శి కొమిరి శెట్టి వెంకటయ్య, కోశాధికారి ఊరే కృష్ణయ్య, తడకమళ్ల శ్రీనివాస్, కుంభం పుల్లారెడ్డి,వేద పండితులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ఆరో వార్డులో హై టెన్షన్ వైర్ల మళ్లింపు బీఆర్ఎస్ హయాంలోనే ప్రారంభమైంది

మీడియా సమావేశంలో మాజీ ఎంపిటిసి బాతుక దేవేందర్ యాదవ్ వెల్లడి

కొత్తూరు, సూర్య టుడే (మే 24): బిఆర్ఎస్ హయాంలో ప్రారంభమైన అభివృద్ధిని కాంగ్రెస్ నాయకులు తమ ఖాతాలో వేసుకుంటున్నారని మాజీ ఎంపిటిసి బాతుక దేవేందర్ యాదవ్ విమర్శించారు.కొత్తూరు మున్సిపాలిటీలోని ఆరో వార్డులో హై టెన్షన్ వైర్ల మళ్లింపు విషయంలో బిఆర్ఎస్ నాయకులు శనివారం పాపిరస్ పోర్ట్ లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు.ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ..ఆరో వార్డులో 33 కెవి హై టెన్షన్ వైర్ల మళ్లింపు ప్రక్రియ గత బిఆర్ఎస్ హయాంలోనే ప్రారంభమైందని చెప్పారు. ఎన్నికల కంటే ముందే 8 స్తంభాలు దానికి సంబంధించిన వైర్ల పని ప్రారంభించామని చెప్పారు.ఆ తర్వాత ఎలక్షన్ కోడ్ రావడంతో ఆ పనులు ఆగిపోయాయని వివరించారు. అనంతరం కాంగ్రెస్ వారు హైవే అవతలి నుంచి ఇవతలకి లైన్ షిఫ్టింగ్ వైర్లు పైకి లేపేందుకు స్టాండ్ అమర్చే పనులు చేశారని చెప్పారు.అయితే వీటన్నింటికీ గత ప్రభుత్వ హయాంలోనే డిడి కట్టామని కాంట్రాక్టర్ కూడా అప్పుడున్న వారే ఇప్పుడు ఉన్నాడని చెప్పారు.కేవలం ఎన్నికల కోడ్ రావడం వల్లే తాము పనులను ఆపామని చెప్పారు.ఇప్పుడు అక్కడ ఉన్న కౌన్సిలర్ ఇంటింటికి వెళ్లి ఈ పనులన్నీ తామే చేస్తున్నామని చెబుతున్నారని విమర్శించారు.మున్సిపాలిటీ నుంచి వచ్చిన నిధులతో చేసిన పనులను కూడా కౌన్సిలర్ తన సొంత నిధులుగా చెప్పి క్రెడిట్ ను తన ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని చెప్పారు. ఆరో వార్డులో ఎంతో అభివృద్ధి చేశామని అక్కడున్న రోడ్లన్నీ బిఆర్ఎస్ హయాంలోని చేశామని అన్నారు.మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మొదట ప్రతిపక్షంలో ఉన్న వార్డుల్లో పనులు చేసి అక్కడి ప్రజల మన్నన పొందాలని చెప్పేవారని గుర్తు చేశారు. అందుకే మొదట కాంగ్రెస్ కౌన్సిలర్ గెలిచిన ఆరో వార్డులోనే అభివృద్ధి పనులన్నీ పూర్తి చేశామని వివరించారు.33 కెవి హై టెన్షన్ వైర్ల మళ్లింపు ప్రక్రియ ను బిఆర్ఎస్ మొదలుపెట్టిందని ఈ విషయాన్ని కౌన్సిలర్ గుర్తించుకోవాలని సూచించారు. మీడియా సమావేశంలో వైస్ చైర్మన్ డోలి రవీందర్,కౌన్సిలర్స్ మాదారం నరసింహ గౌడ్, సోమ్లా నాయక్,అనిత శ్రీనివాస్ గౌడ్, బ్యాగరి ప్రసన్న లత యాదయ్య,మాజీ ఎంపిటిసి జంగ గళ్ళ కృష్ణయ్య,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కర్రోల లక్ష్మయ్య,పేపర్ యాదయ్య,సిటీ కేబుల్ వెంకటేష్,రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# పని మాది భజన వాళ్ళది



# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లుమంజూరు

66 గజాల్లోనే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలి.

దసరా నాటికి ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి.

బీఆర్ఎస్ హయాంలో పేదలకు తీవ్ర అన్యాయం.

823 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల అందజేత.

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి .





ఆదిభట్ల, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 24: అర్హులైన ప్రతి ఒక్కరికీ నియోజకవర్గ వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని బొంగులూర్ ప్రమీద గార్డెన్ లో ఆదిభట్ల, తుర్కయంజాల్ మున్సిపాలిటీలకు చెందిన 823 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి మాట్లాడుతూ పేదోడి సొంతింటి కల నెరవేరుతుంటే సంతోషంగా ఉందన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో ఎవరికి కూడా లంచాలుఇచ్చే అవసరం లేదని పేర్కొన్నారు. అలాంటిది ఎదైనా జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి వాళ్ళను క్షమించేది లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, సబ్సిడిపై వంటగ్యాస్ వంటి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వం 7 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వం ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకునప్పటికి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ముందుకు పోతున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎవరైనా ఇబ్బంది పెడితే నేరుగా తనకు ఫోన్ చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం విడతల వారీగా రూ.5 లక్షల రూపాయలు మంజూరు చేస్తుందని చెప్పారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను విడతల వారీగా అందిస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 20 వేల ఇళ్లు నిర్మిస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని చెప్పారు. కేవలం 66 గజాల్లోనే ఇంటి నిర్మాణం ఉండాలన్నారు. లబ్ధిదారులు ఇళ్లను 45 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. మంజూరు పత్రాలు అందుకున్న వారు వెంటనే నిర్మాణం చేపట్టాలని కోరారు. దసరా నాటికి పూర్తి చేసి, గృహ ప్రవేశాలు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో కబ్జాలకు గురైన ప్రభుత్వ భూములను వెలికి తీస్తున్నామని, త్వరలోనే భూమిలేని పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని , అర్హత ఉండి ఇల్లు రానివారికి రెండో విడతలో మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డీసీ నాయక్, ఆర్డీవో అనంత రెడ్డి, కమీషనర్లు బాలకృష్ణ, అమరేందర్ రెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మహిపాల్, మాజీ ఎంపీపీ లక్ష్మీపతి గౌడ్, టీపీసీసీ సభ్యులు కాకుమాను సునీల్, తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇండస్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహ్మారెడ్డి.




దేవరకొండ, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 24 : దేవరకొండ పట్టణంలోని అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇండ్లస్థలం ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పలా నర్సింహ్మా రెడ్డి అన్నారు. శనివారం నాడు దేవరకొండ పల్లా పర్వత్ రెడ్డి భవన్లో జరిగిన దేవరకొండ పట్టణ 14వ మహాసభ వలమల్ల ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన పల్ల నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లిస్టులో అర్హులలిస్టులో పేరు ఉన్నప్పటికీ సొంత స్థలం లేకపోవడంతో అనర్హులుగా మారుతున్న నిరుపేదలు వారికి ప్రభుత్వమే స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని,అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు ఇవ్వాలని పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వలన అసంపూర్తిగా గుంతల మయంగా ఉన్న రోడ్లను వెంటనే పూర్తి చేయాలని సంవత్సరాలు గడుస్తున్నా శిలాఫలకాలకే పరిమితమైన రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఓట్లు సీట్లతో సంబంధం లేకుండా, ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలే ప్రాణంగా గత వంద సంవత్సరాలుగా సిపిఐ ప్రయాణిస్తుందని ప్రజా సమస్యలే అజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ అని, శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని దున్నేవాడికి భూమి కావాలని, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించినపార్టీ సిపిఐ అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారుల కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని అదుపు చేయకుండా పేదవారి నడ్డి విరిచే విదంగా మళ్ళీ సిలిండర్ ధర పెంచడం అన్యాయమని అన్నారు.పండించిన పంట కు గిట్టుబాటు ధర మరియు, రాబోయే వానకాల పంటలకు ఎరువులు విత్తనాలు సబ్సిడి మీద ఇవ్వాలని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆయన కోరారు. ఈ మహాసభ వలమల్ల ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది ఈ మాసభలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్ రెడ్డి, మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, మాజీ ఎంపీపీ పల్లా సులోచన,పట్టణ కార్యదర్శి జూలూరి వెంకట్రాములు,మహిళా సమాఖ్య డివిజన్ కార్యదర్శి లింగంపల్లి అనిత, పట్టణ సహాయ కార్యదర్శి తోటపల్లి నగేష్, శాఖ కార్యదర్శిలు జూలూరి జ్యోతి బస్ లింగంపల్లి వెంకటయ్య అలమోని మల్లయ్య ఏషామోని మల్లేష్ కందుకూరి శ్రీను ఎండి మైనుద్దీన్ నీల వెంకటయ్య పర్వతం వెంకటాద్రి, నాయకులు రేణిగుంట శ్రీనివాస్, నీలా అనసూయ జక్కా కృష్ణారెడ్డి, పుప్పాల గిరి, రాజ మల్లయ్య, ఎండి జాకీర్ కొండోజు ఆనందచారి మహేశ్వరం బ్రహ్మాచారి బొడ్డుపల్లి గెల్వయ్య, కొండ్రెడ్డి రమేష్, గోరటి శ్రీను వలమల బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

### పోతురాజు విగ్రహ ప్రతిష్ట మహోత్సవ

## కార్యక్రమాన్ని విజయవంతం చేయండి..,



చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 24: చింతపల్లి మండల పరిధిలోని తక్కలపల్లి గ్రామంలో ఈనెల 23 నుండి25 వరకు పోతురాజు విగ్రహ ప్రతిష్ట జరగనున్నాయి. శ్రీశ్రీశ్రీ గణపతి మదేల్ అయ్యా, సీతాలమ్మ ,శివ, నంది, ఈదమ్మ,కీర్తి ధ్వజ పోతురాజు విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నాగరామ మాజీ సర్పంచ్, గుండ్లపల్లి అనిత నర్సిరెడ్డి వేద పండితులు బ్రహ్మశ్రీ దేరం భాస్కర శర్మ రజక సంఘ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 23 నుండి తక్కలపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ గణపతి మదేలయ సీతాలమ్మ శివానంది, కీర్తి ఈదమ్మ పోతురాజు విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా గత రెండు రోజుల నుండి వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.శనివారం మూల మంత్ర హోమములు, ప్రతిష్ట విగ్రహాలకు గోక్షిరాధ వాసం, ధాన్యది వాసు. విగ్రహములకు స్నాపన. ము, హోమాలు, ప్రదోష పూజ, అనంతరం తీర్థ ప్రసాద కార్యక్రమాలు అందజేయడం జరిగింది. అదేవిధంగా 25 ఆదివారం రోజు ఉదయం 7:30 కు మండప పూజలు హోమాలు తదితర కార్యక్రమాలు భక్తులు అనంతరం కుంభ నివేదన కార్యక్రమం అలంకార పూర్ణావతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చివరి రోజు ఆదివారం ఈ కార్యక్రమాలు ముగియనున్నాయి.

### కోరిన కోరికలు తీర్చే మహిమగల దేవుడు

## చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేస్వామి

మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్

చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ



షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (మే 24): షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ, జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీ రామ నామస్మరణ మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్ర చార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సోలిపూర్ మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. భక్తులు నియమనిష్టలతో చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామిని పూజిస్తే తమ కోరికలు నెరవేరుతాయని, ఎంతో మహిమగల దేవుడని ప్రతి ఒక్కరు విశ్వసిస్తారని అన్నారు. ఐదు శనివారాలు భగవంతునికి ప్రదక్షిణలు చేసి భక్తితో బలంగా కోరుకుంటే తమ కోరికలు నెరవేరుతాయని తెలిపారు. దేవాలయ అభివృద్ధికి అన్నదానానికి సహకరిస్తున్న దాతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం చేశారు. పట్టణానికి చెందిన యాదయ్య అనే భక్తుడు 25 కిలోల బియ్యం నూనె కూరగాయలు మరియు మోతిఘనపూర్ గ్రామానికి చెందిన బాలాజీ 1100 రూపాయలు విరాళం అందజేశారు. వారికి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, అన్నారం రఘు గౌడ్, జి.వసంతరావు, గడ్డమీద రమేష్ ముదిరాజ్, శంకర్ గౌడ్, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మికాంత్ రెడ్డి, కృష్ణ చారి, శంకరయ్య, వీఆర్వో బచ్చన్న, యాదగిరి, పి.ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, సుధాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల
# మంజూరు పత్రాలు అందజేత



ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి మే 24: ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామంలో ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు శనివారం లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ ను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంకాల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల సమక్షంలో పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పట్నం శివశంకర్, పిట్టల యాదగిరి, గట్టు జంగయ్య, మంగ, అరుణ, పంచాయతీ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహాలకు భూమిపూజ,శంకుస్థాపనలు

షాద్‌నగర్ సూర్య టుడే ప్రతినిధి (మే 24): షాద్ నగర్ శనివారం 22వ వార్డు రథన్ కాలనీ లో ఇందిరమ్మ గృహాలకు భూమి పూజ,శంకుస్థాపనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రం లో మాజి కౌన్సిలర్ నడికుడ సరిత యాదగిరి యాదవ్, షాద్ నగర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొంకల్ల చెన్నయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూరి విశ్వం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బస్వం అప్ప, మాజీ కౌన్సిలర్ సర్వర్ పాషా



పాల్గొన్నారు. లబ్ధిదారులు విప్పరి లక్ష్మీ గోపాల్ కు ఇందిరమ్మ గృహం మంజూరైన పత్రాన్ని అందజేశారు. 18 వ వార్డులో శ్రీనగర్ కాలనీ వాసులు అర్షియా బేగంకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైన ప్రసిడెంట్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు తంగేడి పల్లి శంకర్ జమాల్పూర్ చందూలాల్ కత్తి చంద్రశేఖరప్ప, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లిఫరూక్ నగర్ మండలంలో:-

ఫరూక్ నగర్ మండలం గంట్లవెల్లి గ్రామంలో శనివారం 12 ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరిత, మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ మాజీ ఎంపిటిసి బాదేపల్లి సిద్ధార్థ, మాజీ సర్పంచ్ కర్రోళ్ల యాదమ్మ యాదయ్య, మాజీ డిప్యూటీ సర్పంచ్ మూడవత్ భాస్కర్, కాంగ్రెస్ పార్టీ విలేజ్ అధ్యక్షుడు కుమ్మరి బాలరాజ్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు వర్కూరి వజ్రాలింగం, ఎసి సెల్ అధ్యక్షుడు చారకొండ యాదయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మొహమ్మద్ తోపిక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రంథాలయ కమిటీ డైరెక్టర్ అనిల్ కుమార్ యాదవ్, వసీమ అక్రమ్, చారకొండ నర్సింలు, మొహమ్మద్ సాదిక్, మహమ్మద్ గౌస్, తదితరులు పాల్గొన్నారు. ఫరూక్ నగర్ మండలం (గంట్లవెల్లి) దేవుని బండ తండా గ్రామ పంచాయతీలో మంజూరైన 14 ఇందిరమ్మ ఇండ్లకు గాను శనివారం లబ్ధిదారులకు మంజూరైన ఇండ్ల పత్రాలు అందజేసి భూమి పూజ చేసిన లబ్ధిదారులు, హీరామన్ విజయ మరియు, గ్రామపంచాయతీ సెక్రెటరీ గీత , కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంట్ల వెల్లి సుమన్ ఉపసర్పంచ్ రమేష్ నాయక్, బాదావత్ శంకర్ (బుక్ కీపర్) మూడవ శ్రీను, హీరమన్, లిబియా నాయక్, జాన్ నాయక్, రాజేందర్ ,శంకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మొగిలిగిద్ద లో శ్రీదేవి,భూదేవి
## రంగనాయక స్వామి కళ్యాణం అత్యంత వైభవం



షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (మే 24): ఫరక్ నగర్ మండలం లోని మొగిలిగిద్ద గ్రామంలో ని శ్రీ శ్రీ గోదా రంగనాయక స్వామి దేవాలయంలో శనివారం బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీదేవి,భూదేవి లతో శ్రీ గోదా రంగనాయక స్వామి యొక్క కళ్యాణం అత్యంత వైభవంగా ,వేద పండితులు రాము చార్యులు బృందం వేదమంత్రాలు మధ్య అత్యంత వైభవంగా జరిగింది ధర్మకర్తలు,పురుషోత్తమాచార్యులు, కేశవాచార్యులు, రాజగోపాల్ ఆధ్వర్యంలో,ఈ కార్యక్రమంలో ఈఓ శివకుమార్, కక్కునూరి వెంకటేష్ గుప్తా,అనుమారి వెంకటయ్య, కక్కునూరి బాలచంద్రశేఖర్ పల్లె గడ్డి శ్రీనివాస్ ,సిరిగిద్ద యాదయ్య,ర్యాకల మల్లేష్ ,మెరుగు యాదగిరి ,తుపాకుల రవి,ర్యాకల తిమ్మాయి నరసింహ , (విశ్రాంతి) ఉపాధ్యాయుడువీరభద్రప్ప,బోర యాదయ్య,,గండ్ల మల్లేష్ అనంతం రాజేందర్ రెడ్డి, రాధాకృష్ణ, బొబ్బిలి చైతన్య రవి రాజు నారని బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## కోటాలోనే విద్యార్థులు ఎందుకు చనిపోతున్నారు

న్యూఢిల్లీ : కోటాలోనే విద్యార్థులు ఎందుకు చనిపోతున్నారని సుప్రీంకోర్టు శుక్రవారం రాజస్తాన్ ప్రభుత్వాన్ని నిలదీసింది. పరిస్థితి తీవ్రమైనదని పేర్కొంది. ఈ ఏడాది ఇప్పటివరకు కోటాలో 14 ఆత్మహత్య కేసులు నమోదయ్యాయని, అక్కడే ఎందుకు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని జస్టిస్ జె.బి.పార్థివాలా, ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. "రాష్ట్రప్రభుత్వంగా మీరు ఏంచేస్తున్నారు, ఎలాంటి చర్యలు తీసుకున్నారు. కోటాలో మాత్రమే విద్యార్థులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు" అని ప్రశ్నించింది. ఆత్మహత్యల కేసులను పరిశీలించేందుకు రాష్ట్రంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ని ఏర్పాటు చేశామని ప్రభుత్వం తరపున న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఖరగ్‌పూర్‌లోని ఐఐటిలో చదవుతున్న 22ఏళ్ల విద్యార్థి మృతిపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. మే 4న ఘటన జరగగా, మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, నాలుగు రోజులు ఎందుకు తీసుకున్నారని సంబంధిత పోలీస్ అధికారులను ప్రశ్నించింది. చట్ట ప్రకారం దర్యాప్తు చేపట్టాలని ఆదేశించింది. ఆత్మహత్య గురించి తెలుసుకున్న తర్వాత ఐఐటి ఖరగ్‌పూర్ అధికారులు పోలీసులను అప్రమత్తం చేసినట్లు రికార్డుల్లో ఉంది. అయితే, ఖరగ్‌పూర్ న్యాయవాది మరియు పోలీస్ అధికారుల వివరణలతో ధర్మాసనం ఏకీభవించలేదు. "మీరు మా తీర్పుని ధిక్కరిస్తున్నారు. మీరు ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదు" అని రాజస్తాన్ తరపు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. కోటాలో నీట్ అభ్యర్థి తన తల్లిదండ్రులతో కలిసి నివసించిన గదిలోనే చనిపోయి కనిపించిన మరో కేసు గురించి కూడా ధర్మాసనం ప్రశ్నించింది. పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ అధికారి తన విధి నిర్వహణలో విఫలమయ్యారని, కోర్టు జారీ చేసిన ఆదేశాలను పాటించలేదని ధర్మాసనం పేర్కొంది. పరిస్థితిని వివరించాల్సిందిగా ఆ పోలీస్ అధికారికి సమన్లు జారీ చేసింది.

## నవంబర్ 1 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా కేరళ

తిరువనంతపురం : ఈ ఏడాది నవంబర్ 1 నాటికి కేరళ పేదరిక రహిత రాష్ట్రంగా మారుతుందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. తిరువనంతపురంలో శుక్రవారం ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ నాలుగవ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ.. దేశంలోనే కేరళ అత్యల్ప పేదరిక స్థాయిని కలిగి ఉందని అన్నారు. బలమైన మరియు సమర్థవంతమైన ప్రజా పంపిణీ వ్యవస్థతో ఇది సాధించగలిగామని, ఈ అభివృద్ధిని గత కొన్ని సంవత్సరాలుగా తమ ప్రభుత్వం స్థిరంగా బలోపేతం చేస్తోందని అన్నారు. భవిష్యత్ దృష్ట్యా ప్రజా భాగస్వామ్య విధానాలను పారిశ్రామిక వ్యూహాలతో మిళితం చేయడం ద్వారా కేరళ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. దేశంలోనే అతి తక్కువ ద్రవ్యోల్బణం ఉన్న రాష్ట్రం కేరళ అని, నవంబర్ 1 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా మారుతుందని ఉద్ఘాటించారు. 2016లో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చేపట్టిన సమయంలో ..రాష్ట్రంలో పెట్టుబడి పరిస్థితులను మార్చడం ఆందోళన కలిగించే కీలకాంశాల్లో ఒకటిగా ఉందని గుర్తు చేసుకున్నారు. ఆందోళనలు తొలగించేలా పారిశ్రామిక వేత్తలు, వాటాదారులతో తమ ప్రభుత్వం వివరణాత్మక చర్చలు జరిపిందని, పథకాల రూపకల్పనలో వారి అభిప్రాయాలను కూడా చేర్చామని అన్నారు. ఫలితంగా రాష్ట్రంలో వ్యాపారాలను సులభతరం చేసేందుకు అనువుగా చట్టాలను, నిబంధనలను సవరించామని, అనేక నిర్మాణాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టామని అన్నారు. పథకాల్లో మార్పులతో పాటు పారిశ్రామికీకరణకు అనుగుణంగా సామాజిక దృక్పథాన్ని కూడా మార్చాల్సిన అవసరాన్ని గుర్తించామని, అందుకే కేరళలో 'ఇయర్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' ను ప్రారంభించామని అన్నారు. ఈ నమూనాను కేంద్ర ప్రభుత్వం జాతీయ నమూనాగా గుర్తించిందని విజయన్ పేర్కొన్నారు. పన్ను ఆదాయ పంపిణీలో రాష్ట్రానికి లభించాల్సిన హక్కును కేంద్రం నిరాకరించిందని అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన పన్ను వాటాను న్యాయంగా కేంద్ర ప్రభుత్వం కేటాయించి వుంటే, 2022-23లో వరుసగా 2,282కోట్లు, 2023-24లో రూ.2.071 కోట్లు అదనంగా వచ్చేవని అన్నారు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో , దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల మొత్తం పన్ను ఆదాయంలో కేరళ వాటా 3.7శాతమని అన్నారు. ఇదే సమయంలో కేంద్రం నుండి కేరళకు వచ్చిన పన్ను వాటా వరుసగా 1.53 శాతం మరియు 1.13 శాతం మాత్రమేనని అన్నారు. కేరళ జనాభా ఆధారంగా రాష్ట్రానికి 2.7శాతం వాటా రావాల్సి వుందని, ఇది అదనపు డిమాండ్ కాదని, కేరళకు రావాల్సిన నిజమైన వాటా అని.

# 'సాగు' సజావుగా సాగేనా?



ఈ ఏడాది నైరుతీ పవనాలు కేరళ తీరాన్ని సాధారణం కంటే ఐదు రోజుల ముందే తాకబోతున్నట్లు భారత వాతా వరణ శాఖ(ఐఎండీ) ప్రకటించింది. జూన్ ఒకటిన రావాల్సిన పవనాలు ఈ నెల 27నే తీరాన్ని తాకనున్నట్లు ప్రకటించింది. తెలంగాణలో జూన్ మొదటివారంలోనే తొలకరి వర్షాలు పడతాయని ముందస్తు శుభవార్త అందించింది. ఈ సారి వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాఖ మోసుకొచ్చిన చల్లని కబురు అన్నదాతల్లో ఆశలు చిగురింప జేసింది. గతేడాది అకాల వర్షాలు, నాసిరకం, కల్తీ విత్తనాలు, పంటలకు ధరలేమి ఇత్యాది సమస్యలన్నీ కట్ట కట్టుకొని రైతులకు నష్టాలు మూటగట్టాయి. అప్పుల భారంతో ఎంతోమంది అన్నదాతలు తనువు చాలించారు. యాసంగి చివరిలోనూ అకాల వర్షాలు కన్నీరు పెట్టించాయి.కొద్దిరోజులుగా ఎక్కడో చోట ఏదోమూల అకాల వర్షాలు పడుతూ రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీనకంతంటికీ వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు ఒక బాగమైతే, పంటల కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం కూడా చాలా స్పష్టంగా కనిపించింది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వ్యవసా యాన్ని నమ్ముకున్న రైతు వాటన్నంటినీ తట్టుకుని ముందుకు సాగుతున్నాడు. ఈమారైనా 'కాలం' కలిసి వస్తుందని రైతులు రాబోవు వానాకాలం పంటపై ఆశలు పెట్టుకున్నారు. అందుకే విత్తనాలు జల్లేందుకు పంట పొలాలను రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. గతం పునరావృతం కాకుండా రాష్ట్రప్రభుత్వం రుణాల మంజూరు, విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకుని రైతులకు సకాలంలో అందించేందుకు ఏర్పాట్లు చేయాలి. సాంకేతిక కారణాలతో రెండు లక్షల రుణమాఫీ సమస్య పూర్తికాలేదు. దాదాపు పద్దెనిమిది లక్షల మంది ఎదురుచూస్తున్నారు. రైతు భరోసా సాయంపై అనుమానాలు అలానే ఉన్నాయి. విత్తనాలు, ఎరువులు కోసం ఎక్కడికి పోవాలన్నది ప్రశ్న. సర్కారులో అలాంటి సన్నద్ధత ఉందా? వానాకాలం సాగు కోసం రాష్ట్రంలో కోటి 34 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవ సాయ శాఖ ప్రణాళిక రూపొందించింది. రేషన్‌దుకాణాల్లో సన్న బియ్యం అందించడం, రూ.500 బోనస్ అందించడం వల్ల సన్నరకాలకే రైతులు మొగ్గు చూపే అవకాశం ఉంది. దీంతో అత్యధికంగా వరి 66.80 లక్షల ఎకరాల్లో సాగు కానుంది. పత్తి 50 లక్షల ఎకరాల్లో సాగు చేయనున్నట్లు తెలిపింది. ఆ తర్వాత మిర్చి, వేరుశనగ, మొక్కజొన్న, సోయా బీన్, మినుములు, కంది, ఇతర ఉద్యానవన పంటలు వేయనున్నారు. సాగుకు తగినట్టుగా 16.70 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు, 95 లక్షల పత్తి ప్యాకెట్లు, 1.35 లక్షల క్వింటాళ్ల సోయా చిక్కుడు, తదితర పంటల విత్తనాలు అవసరమని భావించింది. విత్తన పంపిణీలో మాటలు ప్రతి ఏడాదీ కోటలు దాటుతున్నా, చేతలే గడప దాటట్లేదు. గతంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి విత్తనాల పంపిణీ జరిగేది. ఇప్పుడు ప్రయివేటు కంపెనీల నుంచే ఎక్కువభాగం అందుతున్నాయి. ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల సమీక్షలు ఎలా ఉన్నా సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరు వులు అందవు. క్యూలో నిలబడలేక రైతులు చెప్పులు పెట్టా ల్సిన పరిస్థితులు చూశాం. విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పుకుంటున్నా నాసిరకం విత్తనాలను కొనుగోలు చేయా ల్సిన అగత్యం ఏర్పడుతోంది. దీన్ని అనువుగా చూసుకుని ప్రయివేటు వ్యాపారులు నకిలీ విత్తనాలను అంటకట్టడం వల్ల వేలాది రూపాయలు రైతులు నష్టపోవాల్సి వస్తోంది. నకిలీ విత్తనాలు కొని సాగుచేయడం వల్ల ఆ మొక్కలు తిని పశువులు చనిపోయిన ఘటన ము లుగు జిల్లాలో తాజాగా వెలుగుచూసింది. కర్నాటక, మహా రాష్ట్ర, చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు రాష్ట్రంలో అడుగు పెడుతున్నాయి. అమ్మేవారిపై తప్ప నకిలీ విత్తనాలు తయారు చేస్తున్నవారిపై చర్యలు ఉండవు. ఈ విష యంలో కేంద్రం కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఏ భూమిలో ఏయే పంటలు సాగు యోగ్యమో రైతులకు వ్యవసాయశాఖ అవగాహన కల్పించాలి. ఏప్రిల్‌లోనే పరీక్షలు జరిపి మే నెలాఖరు నాటికి కార్డులు జారీ చేయాలని ఏండ్ల తరబడి అనుకుంటున్నా ముందుకు సాగడం లేదు. రైతు మహోత్సవాల పేరిట ఇటీవల సదస్సులు నిర్వ హించినా ఉపన్యాసాలకే పరిమిత మయ్యాయి. దీనివల్ల రైతుకు అవగాహన కాలేదు. రైతు చేతిలో భూసార కార్డు ఉంటే తన పొలంలో ఏపంట వేసుకోవాలి. ఎలాంటి ఎరువులను వాడా లన్నది తెలుసుకునే వాడు. పంటలు నష్టపోయిన రైతులు బీమా, ఇన్‌పుట్ సబ్సిడీల కోసం నిరీక్షిస్తు న్నారు. ఇటీవల అకాల వర్షాలతో వెయ్యికోట్లకు ్కటగా నష్టం వాటిల్లినా, వాటికి ఇంతవరకూ నష్ట పరిహారం అందించిన దాఖలాల్లేవు.ఖరీఫ్ ప్రారం భ వేళ రైతులను ముసురుకుంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలి.సాగునీటి విడుదల విషయమై ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి. ఉత్తుత్తి మాటలు శుష్క వాగ్దానాలతో సమయాన్ని వృథా చేయకుండా సాగు సజావుగా సాగేందుకు సర్కార్ అవసరమైన అన్ని చర్యలూ యుద్ధప్రాతిపదికన చేపట్టాలి.

# సిబిల్ స్కోర్ దరఖాస్తుదారులను గుబులు




కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 'రాజీవ్ యువ వికాసం' ఆశావహ నిరుద్యోగులకు అందుతుందా లేదా అన్న గందరగోళం నెలకొంది.యువతకు ఆర్థిక చేయూత అందించేందుకంటూ తెచ్చిన ఈ పథకం యువతను తిప్పలు పెడుతున్నది.బ్యాంకు సిబిల్ స్కోర్ దరఖాస్తుదారులను గుబులు పెడుతున్నది. ప్రభుత్వం కుటుంబంలో ఒక్కరికే అవకాశం కల్పించడమేగాక, రేషన్‌కార్డు ఉంటేనే పథకానికి అర్హత వంటి నింబంధనలు పెట్టింది. గత సర్కార్ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కోసం చేసుకున్న దరఖాస్తులు ఇప్పుడు మెడకు గుదిబండలా మారాయి. రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తులో ఆధార్ నంబర్‌ను నమోదు చేయగానే 'ఆల్రెడీ అప్లైడ్' అని చూపుతున్నది. ఇక వికలాంగుల సంగతి సరేసరి. ఈ ఆటంకాలన్నింటిని దాటుకొని యాభై లక్షల మంది నిరుద్యోగులకు గాను 16.23 లక్షల దరఖాస్తు వచ్చాయి. ఇప్పుడు వీరిని సిబిల్ నిబంధనలు పరేషాన్ చేస్తున్నాయి. వాస్తవానికి నిరుద్యోగులు రూపాయి ఆదాయం లేకనే ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. దమ్మిడి ఆదాయం లేని యువకులకు బ్యాంకుల్లో అకౌంట్లు ఎక్కడివి? ఉన్నా అవి పైచదువుల కోసం సర్కార్ ఇచ్చే స్కాలర్ షిప్‌ల కోసం తెరిచినవే కానీ వాటిలో పెద్దగా లావా దేవీలు ఉండవు. ప్రభుత్వం ఇచ్చే కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు, చిరు వ్యాపారులకు ఇప్పుడు బ్యాంకర్ల సిబిల్ స్కోరు తనిఖీ పెద్ద ఆటంకంగా మారుతున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు సిబిల్ స్కోరు బావుంటేనే లోన్లు లభిస్తాయనడం ఎంత వరకు సబవు? ఈ నిబంధన యువతకు ప్రతిబంధకంగా మారుతున్నది. ఎన్నో ఆశలతో సబ్సిడీ రుణాలు పొంది జీవితంలో సెటిల్ అవుదామనుకుంటున్న నిరుద్యోగుల ఆశలపై సిబిల్ స్కోరు నీళ్లు చల్లుతున్నది. బ్యాంకర్లు గుడ్, బ్యాడ్, ఎక్సలెంట్, యావరేజ్ అంటూ సిబిల్ స్కోరు నిర్ణయిస్తున్నారు. ఆధార్‌కార్డు నెంబర్, బ్యాంక్ అకౌంట్లు, ఫోన్ నెంబర్లు కేవైసీ చేసి వాటి ద్వారా నిరు ద్యోగుల, చిరు వ్యాపారుల సిబిల్ స్కోరు ర్యాంకులను నిర్ణయిస్తారు. క్రెడిట్ కార్డు వాడేవారికి, పెద్ద వ్యాపారులకు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు దీనిపై పూర్తి స్థాయి అవగాహన ఉంటుంది. స్కోరు పడిపోకుండా వారు డబ్బులను రొటేషన్ చేస్తుంటారు. కొత్తగా బ్యాంక్ అకౌంట్ తెరిచిన వారికి మైనస్ ఒకటి ర్యాంకింగ్ ఇచ్చి చిన్నపాటి రుణం మాత్రం ఇస్తారు. ఇకపోతే ఫోన్ యాప్‌ల్లో లోన్లు తీసుకున్నవారికి, క్రెడిట్‌కార్డు లోన్లు ఉన్నవారికి సిబిల్ స్కోరు తక్కువ గానే ఉంటుంది. రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసిన వారికి ఆదాయం ఉండదు. ఆ ఆదాయ మార్గాలు, ఉపాధి మెరుగు పర్చుకునేందుకే ఈ లోన్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఈ పథకం కింద వివిధ కార్పొరేషన్ల ద్వారా రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు వ్యక్తిగత రాయితీ రుణాలిచ్చి వారికి అండగా నిలబడతామని ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మే నిరుద్యోగ యువత సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారిని సిబిల్ పేరుతో వంచనకు గురి చేయడం ఈ ప్రభుత్వానికి తగునా? నిరుద్యోగులకు వరంగా రూపొందించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2 నుంచి అమల్లోకి రానుందని ప్రభుత్వం చెబుతున్నది. ఇదంతా బాగానే ఉన్నా యువ వికాసం రుణాలు రావాలంటే తప్పనిసరిగా బ్యాంకు సిబిల్ స్కోర్ 700 దాటితేనే రుణాలకు అర్హులని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని అధికారులు అంటు న్నారు. కానీ, ఇదంతా కేవలం సోషల్ మీడియా ప్రచారం మాత్రమే తప్ప వాస్తవం కాదని, లబ్ధిదారుల ఎంపికకు సిబిల్ స్కోర్‌కు సంబంధం లేదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటన చేసినప్పటికీ.. ఈ ప్రచా రం మాత్రం ఆగటం లేదు. ఇటు ప్రభుత్వ మాటలకు అటు అధికారుల చేతలకు పొంతన లేక నిజమైన లబ్దిదారులకు న్యాయం జరుగుతుందా అన్న అనుమానాలు చెక్కర్లు కొడుతున్నాయి. దీంతో దరఖాస్తు దారులు అయోమయానికి గరువు తున్నారు. మరోవైపు లబ్ధిదారుల జాబితాల వెల్లడికి సమయం దగ్గర పడుతున్నది. జూన్ 2న మంజూరు పత్రాలను అందజేస్తారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన ఉంటుందా? దరఖాస్తు దారుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుం టుందా? అనేది ఉత్కంఠగా మారింది! కాబట్టి ఈ గందరగోళానికి తెరదించి యువతకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

# 'నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంది'




'నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుంది' ఇది ఎప్పటిదో నానుడి. నోరు మంచిదవటం అటుంచి కంపుగా, మూర?గా మారితే ఎంత దుర్మార్గంగా తయారవుతుందో విజరుషా, జగదీశ్ దేవడా ఇంకా మరికొన్ని నోళ్లు బహిరంగంగా నిరూపిస్తున్నాయి. గత పదకొండేండ్ల నుండి ఇలాంటి వాళ్ల నోటి నుండి వస్తున్న కంపును భరించలేక చస్తున్నాం. ఇవేవో వ్యక్తిగతమేకాదు, వ్యవస్థాపరమైన, సమాజం మొత్తానికి వర్తించే విచ్చిన్న భావజాలపు కల్మషాలకు వ్యక్తం చేస్తున్నాయి. వ్యవస్థలనే అవమానపరచే దుష్ట ధ్వనులివి. నోళ్లు నిండిన మాటలు, కేవలం నోళ్లలోంచేరావు. అవన్నీ వాళ్ల మనసు బురదల్లో పుట్టిన ఆలోచనలే. మూర?త్వం మూర్తీభవించిన వారి అభివ్యక్తులు అవి. ఈ నోళ్లను కట్టడి చేయకపోతే వాతావరణ మంతా దుర్గం ధాన్ని వెదజల్లుతూనే ఉంటుంది. పెహల్గాం దాడి తర్వాత మన భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు సైన్యం చేపట్టిన సిందూర్ ఆపరేషన్ విజయవంతం అయినందుకు, దేశంలోని ప్రజలందరూ, ప్రతిపక్షాలూ, దేశ వాసులందరూ ప్రభుత్వానికి, సైన్యానికి సంపూర్ణ మద్దతును అందించారు. తరతమ భేదాలన్నీ మరచి వెన్నంటి ఉన్నారు. ఇలాంటి ఐక్యత అవసరమైన వేళ విచ్ఛిన్న ప్రకటనలు, అవమాన పరిచే ఉక్తులు, అధికారపు హోదాలు వెలగపెడుతున్నవారి నుండి రావటం క్షమించరాని నేరమే అవుతుంది. ఆపరేషన్ సిందూర్‌లో ప్రముఖపాత్ర పోషించిన కల్నల్ సోఫియా ఖురేషీ, అందుకు సంబంధించిన వివరాలను దేశానికి సగర్వంగా వివరించి తెలిపింది. అట్లాంటి ఒక వీరవనితపై మధ్యప్రదేశ్ ప్రభుత్వంలోని మంత్రి, బీజేపీ నాయకుడు విజరుషా దుర్మార్గమైన వ్యాఖ్య చేశాడు. సోఫియా ఖురేషీ 'ఆమె ఉగ్రవాదుల సోదరి' ఆమెతోనే ఉగ్రవాదులను మట్టుపెట్టించారు మన ప్రధాని అని వ్యాఖ్యానించాడు. ఉగ్రవాదుల సోదరి అని ఎందుకన్నాడంటే, ఉగ్రవాదులు ముస్లిం మతస్తులు కావున మన కల్నల్ ఖురేషి ముస్లిం కావడం, ఆయన ఆలోచనలు మతపరంగానే విశ్లేషించాయి. ఇది చాలా తీవ్రమయిన వ్యాఖ్య. మన సైన్యంలో అనేకమంది అనేక మతాలకు, ప్రాంతాలకు సంబంధించిన వారు తమ సేవలను అందిస్తున్నారు. అంతేకాదు, త్యాగాలను చేస్తున్నారు. భారతదేశం లౌకికదేశమని స్వయానా ఖురేషీ వెల్లడించింది. పెహల్గాంలో తీవ్ర వాదులు మతం పేరు అడిగి చంపారంటున్నారు. మన మంత్రులూ మతాన్ని ఆధారం చేసుకునే మాట్లాడుతున్నారు. ఇది ఖురేషీ సేవను, సాహసాన్ని, నిబద్ధతను అవమానించే వ్యాఖ్య. ముప్పయి ఏండ్ల నుండి సేవ చేస్తూ ఎన్నో ప్రశంసలను పొందిన కల్నల్ ఆమె. ఆమే కాదు, ఆమె తాత, తండ్రి అందరూ దేశం కోసం సైన్యంలో పనిచేసినవారే. 'మాకు ముందు దేశం, ఆ తర్వాతే మతం' అని ప్రకటించిన వారు కూడా. విజరుషా వ్యాఖ్య తీవ్రమైందిగా భావించి హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. కేసు నమోదు కాగా దానిపై స్టే ఇవ్వాలని సుప్రీంకు వెళ్లగా సుప్రీంకోర్టు నిరాకరించి, కల్నల్‌కు క్షమాపణ చెప్పాలని హెచ్చరించింది. ఇవన్నీ జరుగుతున్నా ఇంతవరకు, అక్కడి ప్రభుత్వం కానీ, బీజేపీ నాయకత్వంకానీ అతనిపై ఏ చర్యా తీసు కోలేదు. ప్రధాని కూడా మాట్లాడలేదు. సోఫియా కుటుంబ సభ్యులు సైతం ఆ రకమైన వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రధాని, రక్షణ మంత్రి, హోం మంత్రులకు విజ్ఞప్తి చేశారు. మతం ఆధారంగానే మనుషులను చూడటం మాట్లాడటమనేది రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్నవారు చేయవచ్చా! ఇదిలావుంటే సైనికులకు చేతులెత్తి సలాం చేయాల్సిన వేళలో ఆపరేషన్ సిందూర్ సందర్భంగా యావత్ సైన్యం ప్రధాని మోడీ పాదాలకు ప్రణమిల్లిందని, మన సైన్య పరాక్రమాన్ని అవమానిం చాడు మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జగదీశ్ దేవ్డా. తక్షణమే క్షమా పణలు చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. అంతేకాదు, కాల్పుల విరమణ ఒప్పందాన్ని మీడియాకు తెలియచేసిన విదేశీ వ్యవహారాల కార్యదర్శి, విక్రమ్ మిస్రీపైన మూర? శిఖామణులు ట్రోలింగ్‌కు తెగబడ్డారు. కాల్పుల విరమణ అనేది ప్రభుత్వాల మధ్య జరిగేదన్న ఇంగిత జ్ఞానం వీళ్లకు లేకపోయింది. అంతకుముందు పెహల్గాంలో భర్తను కోల్పోయిన హిమాన్షుపై కూడా దుర్మార్గమైన ట్రోలింగ్ జరి గింది. ఈ మూర?పు వ్యాఖ్యలు, ట్రోలింగ్స్ అన్నీ దేశభక్తులమని చెప్పు కునే సంఘ పరివార్ శక్తుల నుండే వస్తున్న విషయాన్ని గమనించాలి. ప్రభుత్వాలు ఇప్పటికయినా ఈ నోళ్లను మూయించాలి! దేశ సమైక్యతను దెబ్బతీసే వారిని శిక్షించాలి.



## హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థుల ప్రవేశానికి అనుమతి నిరాకరణ



వాషింగ్టన్ : హార్వర్డ్ యూనివర్శిటీలో విదేశీ విద్యార్థులను చేర్చుకునే అనుమతిని ట్రంప్ యంత్రాంగం రద్దు చేసింది. యూనివర్శిటీపై కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టీ నొయెమ్ పేర్కొన్నారు. హార్వర్డ్ యూనివర్శిటీకి గురువారం పంపిన లేఖలో ఆమె పేర్కొన్నారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభయ్యే ముందు హార్వర్డ్ స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ సర్టిఫికేషన్( విదేశీ విద్యార్థులకు అనుమతి) తిరిగి పొందే అవకాశాన్ని కోరుకుంటే.. వారు 72 గంటల్లోపు అవసరమైన సమాచారాన్ని అందించాల్సి వుంటుందని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ యూనివర్శిటీలో చదువుతున్న విదేశీ విద్యార్థులు ఇతర క్యాంపస్‌లకు బదిలీ కావాల్సి వుంటుంది లేదా చట్టపరమైన హోదాను కోల్పోతారని తెలిపింది. ఈ చర్య హార్వర్డ్‌ను హింస, యూదు వ్యతిరేకతకు బాధ్యులుగా చేస్తుంది. విదేశీ విద్యార్థులను యూనివర్శిటీలో చేర్చుకోవడం హక్కు కాదు, ప్రత్యేక హక్కు అని ఆమె ఎక్స్‌లో పేర్కొన్నారు. విదేశీ విద్యార్థుల నుండి వసూలు చేస్తున్న అధిక ట్యూషన్ ఫీజులు యూనివర్శిటీ బిలియన్ డాలర్ల నిధిని నింపడానికి సహాయపడుతోందని అన్నారు. యూనివర్శిటీ సమాచారం ప్రకారం.. 2024-25 విద్యా సంవత్సరంలో హార్వర్డ్‌లో సుమారు 6,800 మంది విదేశీ విద్యార్థులను చేర్చుకోగా, యూనివర్శిటీ మొత్తం నమోదులో ఇది 27శాతం. ప్రతి ఏడాది 500 నుండి 800 మంది భారతీయ విద్యార్థులు మరియు స్కాలర్లు హార్వర్డ్‌లో చదువుతున్నారని యూనివర్శిటీ అధికారిక వెబ్‌సైట్ పేర్కొంది. ప్రస్తుతం భారతదేశం నుండి 788 మంది విద్యార్థులు హార్వర్డ్ యూనివర్శిటీలో చేరారు.

## పాక్ ఆర్థిక వ్యవస్థపై దెబ్బకొట్టేందుకు భారత్ ప్రయత్నాలు



ఇంటర్నెట్‌డెస్క్: పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆవేదనతో రగిలిపోయిన భారత్.. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్ లోని ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసింది. ఉగ్ర నాగులకు ఆశ్రయం కల్పిస్తున్న పాక్ పైనా చర్యలకు ఉపక్రమించింది. సింధు నది జలాల ఒప్పందం అమలును తాత్కాలికంగా నిలిపివేసింది. అఖిలపక్ష సభ్యులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, దాయాది చర్యలను తూర్పారబడుతూ.. దౌత్య మార్గాల్లోనూ ఒత్తిడి తీసుకొస్తోంది. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తే ఎలాంటి చర్యలకైనా వెనకాడబోమని పాకిస్థాన్‌కు పరోక్షంగా హెచ్చరికలు పంపుతోంది. ఈ క్రమంలోనే పాక్ ఆర్థిక మార్గాలను మూసివేసి, ఆ దేశ ఆర్థిక వ్యవస్థపైనా దెబ్బ కొట్టేందుకు భారత్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే దాయాదికి ఆర్థిక సాయం అందించే ప్రపంచ బ్యాంక్, ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎన్ఏటీఎఫ్)లను కలవాలని భారత్ యోచిస్తోంది. ప్రపంచ బ్యాంక్ 2 బిలియన్ డాలర్ల ఆర్థికసాయం చేస్తుందని పాక్ ఎన్నో ఆశలు పెట్టుకుంది. జూన్ నెలలో వరల్డ్ బ్యాంక్ దీనిపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో పహల్గాం దాడిని ఉటంకిస్తూ.. ప్యాకేజీపై పునరాలోచించాలని ప్రపంచ బ్యాంక్‌కు విజ్ఞప్తి చేసేందుకు భారత్ సిద్ధమవుతోంది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందన్న కారణంతో 2018 జూన్‌లో పాకిస్థాన్‌ను 'గ్రే జాబితా'లో చేర్చారు. దీంతో ప్రపంచ ఆర్థికసంస్థల నుంచి నిధులు మంజూరయ్యేవి కాదు. అయితే, ఉగ్రవాదం అణచివేతకు కృషి చేస్తామని హామీ ఇవ్వడమే కాకుండా.. ఉగ్రవాద సంస్థతో సంబంధం ఉన్న కొందరిని జైళ్లలో పెట్టడంతో.. 2022 అక్టోబర్‌లో పాక్‌ను ఆ జాబితా నుంచి తొలగించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో పాక్‌ను మళ్లీ గ్రే జాబితాలో చేర్చాలని ఎఫ్ఏటీఎఫ్‌పై భారత్ తీవ్రంగా ఒత్తిడి తీసుకొస్తోంది. ఒకవేళ పాక్‌ను మళ్లీ ఆ జాబితాలో చేరిస్తే.. ప్రపంచ బ్యాంకు నుంచి రావాల్సిన 2 బిలియన్ డాలర్ల ప్యాకేజీ ఆగిపోయే అవకాశం ఉంది. మరోవైపు ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎమ్ఎఫ్) సంస్థ పాకిస్థాన్‌కు మే 9న 1 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8,500 కోట్లు) ఆర్థికసాయం మంజూరు చేసింది. దీనిపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది.

## సిగరెట్ కంటే బెట్టింగ్స్ యాప్స్ డేంజర్.. కే.ఏ పాల్ ఆవేదన



**హైదరాబాద్, :** బెట్టింగ్ యాప్స్‌పై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు ఇచ్చిందని ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కే.ఏ పాల్ అన్నారు. బెట్టింగ్ యాప్స్‌పై కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రాలకు సుప్రీం కోర్టు నోటీసులు ఇచ్చిందన్నారు. ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. బెట్టింగ్ యాప్‌ల వల్ల వేల మంది చనిపోయారని గుర్తు చేశారు. లక్షలు, కోట్లు అప్పులు చేస్తూ.. ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలను అడ్డుకునేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని సుప్రీం కోర్టు ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చిందని తెలిపారు. సిగరెట్ తాగితే హానికరం అని ఉంటుందని.. స్మోకింగ్ కంటే మిలియన్ టైమ్స్ బెట్టింగ్ యాప్స్ డేంజర్ అని కే.ఏ పాల్ అన్నారు. 1100లకు పైగా సెలబ్రిటీలు బెట్టింగ్ యాప్ కోసం ప్రమోషన్ చేస్తున్నారని.. బెట్టింగ్ యాప్స్‌ను కోట్ల రూపాయలు తీసుకుని ప్రమోషన్ చేస్తున్నట్లు కే.ఏ పాల్ తెలిపారు. వీటి వల్ల విష్యత్తులో ఆత్మహత్యలు జరగకుండా చూడాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. మానిలాండరింగ్ జరగకుండా ఉండాలంటే.. బెట్టింగ్ యాప్ లను నిషేధించేలా కేంద్రం చట్టం తీసుకురావాలని కోరారు. ఈ యాప్స్ ప్రమేట్ చేసిన వారిపై తెలంగాణలో కేసులు పెట్టారని.. కానీ ఏం చర్యలు తీసుకున్నారు? అని ఆయన ప్రశ్నించారు. దీంతో పాటు రేపు జరగబోయే శాంతి సదస్సు గురించి కే.ఏ పాల్ మాట్లాడారు. జింఖానా గ్రౌండ్ లో రేపు సాయంత్రం శాంతి సదస్సు ఉందని.. రేపు సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు హైకోర్టు అనుమతి ఇచ్చిందని తెలిపారు.

## కాళేశ్వరంలో బాంబులు పెట్టారన్న కేటీఆర్.. సీబీఐ విచారణ చేపట్టాలని మంత్రి డిమాండ్!

**హైదరాబాద్, :** కేటీఆర్ వ్యాఖ్యలు పిటిషన్ గా తీసుకొని సీబీఐ విచారణ చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు లో బాంబులు పెట్టారని కేటీఆర్ అంటున్నారని.. కేటీఆర్ అడుగుతున్నట్టు కాళేశ్వరంలో బాంబులు పెట్టినట్టు అయితే కేటీఆర్ వ్యాఖ్యలు పిటిషన్ గా తీసుకొని సీబీఐతో విచారణ చేయించాలని ముఖ్యమంత్రిని కోరుతున్నట్లు తెలిపారు. హనుమకొండ జిల్లా ములకనూరులో మంత్రి మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పందం ఏంటని సొంత కూతురు కవితనే కేసీఆర్ ను అడుగుతున్నారన్నారు. అధికారంలో ఉన్న వారు ప్రాజెక్ట్ లు నిర్మించడంలో విఫలం అయితే ఆ చెడ్డపేరు కాంగ్రెస్ పార్టీ మీద నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రాజెక్టులు నిర్మిస్తుందని.. ప్రాజెక్ట్ లు కూలగొట్టదన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా.. నిన్న కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం విషయంలో నిజం నిలకడగా తేలుతుందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఒక బ్యారేజీలో 2 పగుళ్లు వస్తే ఏదో అయినట్లు చేస్తున్నారని విమర్శించారు. మేడిగడ్డ పగుళ్లకు బహుశా కాంగ్రెస్ వాళ్లే కారణం కావొచ్చని ఆరోపించారు. వాళ్లే మేడిగడ్డకు బాంబులు పెట్టారని అనుమానం వ్యక్తం చేశారు. కమీషన్ల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే కాళేశ్వరం డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. ఘోష్ విచారణ పూర్తయిందని అని చెప్పి.. ఇప్పుడు నోటీసులు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. బాంబులు పెట్టారన్న వ్యాఖ్యలపై నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ.. ఈ వ్యాఖ్యలు చేశారు.

# రోబోలకు బాబు.. మనిషిలాంటి డాబు హ్యూమనాయిడ్

### సులభంగా పనులు చక్కబెట్టేస్తుంది
### విభిన్న రంగాల్లో పెరుగుతున్న వినియోగం..
### స్మార్ట్ టెక్నాలజీతో మారుతున్న వీటి పనితీరు
### హ్యూమనాయిడ్స్ తయారీలోకి దిగ్గజ సంస్థలు..
### ఈ రంగంలో కొత్త ఆశలు రేపుతున్న భారత్



'మనసున మనసై.. బ్రతుకున బ్రతుకై...' - తోడొకరు ఉండటానికేముంది కానీ.. ఇంట్లో వంట పనికి తోడుండగలరా? ఇల్లు తుడవటానికి తోడుండగలరా? గిన్నెలు తోమటానికి, బట్టల్ని నీళ్లలో జాడించటానికీ, దండెం మీద ఆరేయటానికీ తోడుండగలరా? అది కదా నిజంగా తోడుగా ఉండటం అంటే! ఒక్క ఇల్లనే కాదుబీ ఇంటి పనీ, వంట పనీ అనే కాదు - చేదోడు అవసరమైన ప్రతి చోటా, ప్రతి రంగంలో మనసెరిగి పనులు చక్కబెట్టే మనిషొకరు ఉంటే ప్రపంచం ఎంత సౌఖ్యంగా మారిపోతుంది! నిజమే కానీ, మానవ మాత్రులెవ్వరూ అలా తోడుగా ఉండలేరు. అందుకొక మెషీన్ కావలసిందే. వట్టి మెషీన్ కాదు.. మనిషి లాంటి మెషీన్.. అంటే.. హ్యూమనాయిడ్!!

### మొన్న మే 21న..

టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ 'కనీ విని ఎరుగని'అంటూ ఒక వీడియో క్లిప్ విడుదల చేశారు. అందులో 'ఆప్టిమస్'అనే హ్యూమనాయిడ్ ఇంటి పనుల్ని చలాకీగా చక్కబెట్టేస్తోంది. వంగి, చెత్త బ్యాగును తీసి డస్ట్ బిన్‌లో పడేస్తోంది. ఒక చేత్తో బ్రష్, ఇంకో చేత్తో డస్ట్ ప్యాన్ ఉపయోగించి టేబుల్‌ని శుభ్రం చేస్తోంది. టిష్యూ పేపర్ రోల్ నుంచి చిన్న ముక్కను లాగి తీసుకుంటోంది. స్టౌ మీద గిన్నెలో కూరగాయల్ని గరిటెతో కలియదిప్పుతోంది. గచ్చును తుడుస్తోంది. ప్రశాంతంగా సూచనలు పాటిస్తూ.. 'ఇంకేమైనా పనుందా అమ్మగారూ...'అనే మన పాతకాలపు పనిమనిషిలా తర్వాతి ఆదేశాల కోసం చూస్తోంది. త్వరలోనే మార్కెట్‌లోకి రానున్న ఈ 'ఆప్టిమస్'హ్యూమనాయిడ్ రూ.18-25 లక్షల వరకు ఉంటుందట.

### హ్యూమనాయిడ్, రోబో ఒకటి కాదా..

ఈ ప్రశ్నకు సమాధానం... 'కాదు', 'అవును'కూడా. హ్యూమనాయిడ్‌లన్నీ రోబోలే. కానీ, రోబోలన్నీ హ్యూమనాయిడ్‌లు కావు. రోబో యంత్రమైతే, హ్యూమనాయిడ్ మానవ యంత్రం. రోబో ఏ ఆకారంలోనైనా ఉండొచ్చు. హ్యూమనాయిడ్ మాత్రం కృత్రిమ మేధస్సుతో ప్రత్యేక మానవ నైపుణ్యాలను, మానవాకృతిని కలిగి ఉంటుంది. ఫ్యాక్టరీలో కారు భాగాలు జోడించే సాధారణ రోబోలు, లేదా నేలను శుభ్రం చేసే వాక్యూమ్ క్లీనర్ రోబోలతో పోలిస్తే ఈ హ్యూమనాయిడ్‌లు చాలా వైవిధ్యమైనవి. ఇవి కష్టమైన పనులను సైతం చేయగలవు, మనుషులతో మాట్లాడగలవు, కొత్త పరిస్థితులకు అలవాటు పడగలవు. వీటి ప్రత్యేకత ఏమిటంటే.. వీటి రూపం మనుషులకు సౌకర్యంగా అనిపించడం.

### ఇంత తెలివి ఎలా ?

హ్యూమనాయిడ్‌లు మనుషుల్లా పనిచేయడానికి స్మార్ట్ టెక్నాలజీలను ఉపయోగించుకుంటాయి. ఏఐ మస్తిష్కంతో ఇవి ప్రపంచాన్ని అర్థం చేసుకుంటాయి. వాటిల్లోని సెన్సార్లే.. వాటి పంచేంద్రియాలు. గదిని 3డీలో చూడటానికి, వస్తువులను గుర్తించడానికి 3డీ కెమెరాలు, 'లైడార్' సహాయపడతాయి. గైరోస్కోప్‌లు, యాక్సిలరోమీటర్లు వీటి నడకను బ్యాలెన్స్ చేస్తాయి. 'ఫోర్స్'సెన్సార్లు వస్తువులను అవి పగలనంత సున్నితంగా పట్టుకోవడానికి తోడ్పడ తాయి. విజన్ సెన్సార్లు ముఖాలను గుర్తించడానికి, దారులను కనుక్కోటానికి ఉపకరిస్తాయి. హ్యూమనాయిడ్‌లు మైక్రోఫోన్లతో మాటలను విని, అర్థం చేసుకోగలవు. మోటార్లు, యాక్చుయేటర్లు వాటి కండరాలు. శక్తిమంతమైన కంప్యూటర్ల సెన్సార్ల నుండి వచ్చే సమాచారాన్ని వేగంగా ప్రాసెస్ చేస్తాయి. అందువల్ల హ్యూమనాయిడ్‌లు తక్షణం ఆలోచించి పనిచేయగలదు. బ్యాటరీలతో ఇవి 5 గంటల వరకు పనిచేస్తాయి. కానీ నడిచే హ్యూమనాయిడ్‌లకు చాలా శక్తి అవసరం. వీటిని ఇంటర్నెట్‌తో అనుసంధానిస్తారు.

### 'అక్యూట్'తో భారత్ అరంగేట్రం!

హ్యూమనాయిడ్స్‌ను మనదేశమూ తయారు చేస్తోంది. తొలిసారిగా బిట్స్ పిలానీ 'అక్యూట్'అనే హ్యూమనాయిడ్ కి ప్రాణ ప్రతిష్ట చేసింది. ఇస్రో, డీఆర్‌డీఓ, రిలయన్స్ వంటివి ఈ రంగంలో విస్తృత ప్రయత్నాలు చేస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), సెన్సార్ల వంటి స్మార్ట్ టెక్నాలజీలు ఈ హ్యూమనాయిడ్‌ల మెదడుకు మేత. ఈ మేతకు అవసరమైన కీలక ఎలక్ట్రానిక్ విడిభాగాల కోసం చైనా, యూఎస్, జర్మనీలపై ఆధారపడకుండా పూర్తి స్థాయిలో తయారీ చేపడితే అంతర్జాతీయంగా హ్యూమనాయిడ్ రోబోల రంగంలో భారత్ పోటీపడే అవకాశాలు ఉంటాయని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

### వచ్చే ఐదేళ్లలో 50 వేలు...

ప్రపంచ హ్యూమనాయిడ్ రోబో మార్కెట్ 2024లో 3.28 బిలియన్ డాలర్లు. 2032 నాటికి ఇది 66 బిలియన్ డాలర్లకు చేరవచ్చని నివేదికలు చెబుతున్నాయి. భారత హ్యూమనాయిడ్ రోబోల మార్కెట్ విలువ రూ.1,275 కోట్లు. మొత్తం 8,000 రోబోలలో హ్యూమనాయిడ్‌లు 10 శాతం వరకు ఉంటాయి. ఏటా 25 శాతం రోబోలు తోడవుతున్నాయి. 2030 నాటికి భారత్ 50,000 హ్యూమనాయిడ్‌లను ఉపయోగించే అవకాశం ఉంది. మన హ్యూమనాయిడ్ రోబోల మార్కెట్ 2035 నాటికి రూ.12,750 కోట్లకు చేరొచ్చని అంచనా.

### సవాళ్లు - పరిమితులు

హ్యూమనాయిడ్ రోబోల తయారీ, వినియోగం ఖరీదైన వ్యవహారం. చైనాకు చెందిన 'యూనిట్రీ జీ1'ధర రూ.13.6 లక్షలు. భారత రోబోలు.. ఆప్టిమస్ లేదా యూనిట్రీ జీ1 లాగా స్వేచ్ఛగా కదలలేవు, బ్యాటరీ ఎక్కువసేపు ఉండదు. రోబోలకు 5జీ వంటి వేగవంతమైన ఇంటర్నెట్ కావాలి. భారత్‌లో పూర్తి స్థాయిలో 5జీ విస్తృతం కాలేదు. అయితే మన 'యాడ్‌వర్బ్'భారీ ప్రణాళికలు, డీఆర్‌డీఓ రక్షణ పనులు.. భారత్ సైతం ఈ రంగంలో పోటీపడగలదని నిరూపిస్తున్నాయి. ఖర్చు వంటి సవాళ్లు ఉన్నప్పటికీ ఆశాజనకంగా ఉన్న మార్కెట్, ప్రభుత్వ మద్దతు ఉజ్వల భవిష్యత్తుపై ఆశలు కలిగిస్తున్నాయి.

### పోటీలో దూసుకుపోతున్న భారత్

హ్యూమనాయిడ్ రోబో రేసులో దేశీయ కంపెనీలు చురుగ్గా ఉన్నాయి. మెక్స్ రోబోటిక్స్, స్వాయ రోబోటిక్స్, ఇన్వెంటో రోబోటిక్స్, సిరెనా టెక్నాలజీస్, విస్టాన్‌నెక్స్ట్‌జెన్ తదితర సంస్థలు వీటి తయారీలో ఉన్నాయి. షాపులు, ఫ్యాక్టరీలు, కస్టమర్ సేవల కోసం అహ్మదాబాద్‌కు చెందిన కోడీ టెక్నోలాబ్ తయారు చేసిన 'స్కంద'2024లో రంగ ప్రవేశం చేసింది. షాపుల్లో స్టాక్ నిర్వహణ వంటి పనులు చేస్తుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ పెట్టుబడులు పెట్టిన నోయిడాకు చెందిన యాడ్‌వర్బ్ టెక్నాలజీస్ ఫ్యాషన్, రిటైల్, ఎనర్జీ రంగాల్లో వాడేందుకు హ్యూమనాయిడ్‌ను తీసుకొస్తోంది. ఉత్పత్తులను అసెంబుల్ చేయడం, గిడ్డంగుల్లో వస్తువులను తీసుకెళ్లడం వంటి క్లిష్టమైన పనులు ఇది చేస్తుంది. ప్రమాదకర మిలటరీ పనుల కోసం డీఆర్‌డీఓ, స్వాయ రోబోటిక్స్‌తో కలిసి 2027 నాటికి హ్యూమనాయిడ్‌ను పరిచయం చేయనుంది. ఇది 24 విధాలుగా కదలగలదు. 3డీలో ప్రాంతాలను మ్యాప్ చేయగలదు. బాంబులను నిర్వీర్యం చేయగలదు. ప్రమాదకర ప్రాంతాల్లో సమాచారాన్ని సేకరించగలదు. భారత్ అంతరిక్ష పరిశోధన సంస్థ అంతరిక్ష మిషన్లలో సహాయపడేందుకు వ్యోమమిత్ర హ్యూమనాయిడ్ రోబో తయారుచేసింది.

### కొన్ని హ్యూమనాయిడ్‌లు..

చైనా కంపెనీ యూబీటెక్ వృద్ధుల సంరక్షణ, బోధన కోసం ప్రత్యేక హ్యూమనాయిడ్‌లను తయారు చేస్తోంది. యూఎస్ టెక్నాలజీ సంస్థ ఎజిలిటీ రోబోటిక్స్ తయారు చేసిన 'డిజిట్'లు వస్తువులను తీసుకోవడం, ప్యాక్ చేయడం%అ% చేస్తున్నాయి. స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ రూపొందించిన 'ఓషన్ వన్'... సముద్రంలో ప్రమాదకర ప్రాంతాల్లో, భూగర్భంలో వెలికితీతలకు చక్కగా ఉపయోగ పడుతోంది.

# మావోలకు పెద్ద దెబ్బ



విస్తీర్ణంలో చాలా దేశాలతో పోలిస్తే ఎంతో పెద్దదైన మధ్య భారతంలో కొన్ని దశాబ్దాలుగా సాగు తున్న వామపక్ష తీవ్రవాదం క్షీణిస్తున్న జాడలు గత కొన్నేళ్లుగా కనబడుతుండగా... మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. అబూజ్‌మధ్ అడవుల్లో జరిగిన ఆ ఎన్‌కౌంటర్‌లో ఆయనతోపాటు మరో 26 మంది నక్సలైట్లు చనిపోయారని, వారిలో పలువురు కీలక నేతలు ఉండొచ్చని అధికారిక ప్రకటన చెబుతోంది. ఇరుపక్షాల మధ్యా జరిగిన కాల్పుల్లో భద్రతా బలగాల్లోని ఒక జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోగా, మరికొంతమంది గాయపడ్డారని అధికారిక కథనం. ప్రధాన కార్య దర్శి స్థాయి నేత మరణించటం మావోయిస్టు పార్టీకి నిస్సందేహంగా కోలుకోలేని దెబ్బ. అందుకే కావొచ్చు... ఈ ఎన్‌కౌంటర్ గర్వించదగ్గ విజయమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివాసీల హక్కుల కోసం, దోపి%ఎ%ా నిరోధానికీ ఆయుధం పట్టామని చెబుతున్న మావోయిస్టులు ఇన్ని దశాబ్దాల పోరాటంలో తమ చర్యల పర్యవసానాలనూ, వాటి నిరర్థకతనూ గమనించి సరిచేసుకోలేకపోయారని అర్థమవుతుంది. నక్సలైట్ ఉద్యమం పూర్వాపరాలు గమనిస్తే అదెప్పుడూ పడుతూ లేస్తూనే సాగింది. కానీ తమ పోరాటాలపై రాజ్యం ప్రతిసారీ ఎందుకు పైచేయి సాధించ గలుగుతున్నదన్న అంశంపై వారు దృష్టి పెట్టినట్టు లేదు. అంతకుముందు దేశంలో చెదురుమదురుగా జరిగిన సాయుధ పోరాటాలు అంతరించాయనుకుంటున్న తరుణంలో 1967లో పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లా సిలిగుడి డివిజన్‌లో మారుమూల గ్రామమైన నక్సల్బరీలో రాజు కున్న ఉద్యమం వేగంగా విస్తరించి సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావానికి దారితీసింది. మూడేళ్ల లోపునే పోలీసులు ఆ ఉద్యమాన్ని అణిచేయగలిగారు. దానివెంబడే అప్పటి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో వెల్లువెత్తిన ఉద్యమం సైతం ఎన్‌కౌంటర్ల పరంపర తర్వాత మూడేళ్లకే సద్దుమణిగింది. తిరిగి మరో ఆరేళ్లకు ఉత్తర తెలంగాణలో తలెత్తి విస్తరించిన ఉద్యమం ఒక్కటే దీర్ఘకాలం సాగిందనుకోవాలి. ఈ మూడు చోట్లా ఒకేవిధంగా మొదట్లో మధ్యతరగతి, మేధావి, విద్యార్థి వర్గాలను ఆకర్షించిన ఉద్యమాలు అనంతర కాలాల్లో ఆ వర్గాలకు ఎందుకు దూరమయ్యాయన్న విశ్లేషణను మావోయిస్టులు చేసుకోలేదని వారి ఆచరణ తీరు గమనిస్తే అర్థమవుతుంది. మరోపక్క నక్సల్ ఉద్యమం చీలికలూ, పేలికలూ అయింది. సీపీఐ (ఎంఎల్) భిన్నవర్గాలుగా విడిపోయింది. లిబరేషన్ వంటి పార్టీలు పార్ల మెంటరీ పంథాకు మళ్లి చెప్పుకోదగ్గ విజయాలు సాధిస్తున్నాయి. పాలకులెవరైనా ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయటానికీ, ప్రభుత్వ విధా నాలు సక్రమంగా లేవనుకుంటే ప్రజల్ని కూడగట్టి ఉద్యమించటానికీ ఎప్పుడూ అవకాశాలుంటాయి. 2014లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక భూసేకరణ చట్టం సవరించినప్పుడూ, అనంతర కాలంలో సాగు చట్టాలు తీసుకొచ్చినప్పుడూ రైతాంగం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. చివరకు కేంద్రం ఆ చర్యల్ని వెనక్కి తీసుకోక తప్పలేదు. మావోయిస్టు పార్టీ వీటిని గమనంలోకి తీసుకుందా? అంతక్రితం 1977 తర్వాత ఉద్యమాల్లోకి ప్రజల్ని కూడగట్టడంలో విజయం సాధించినా అటుపై ఆ ఉద్యమాలకు తోడు సాయుధ చర్యలు కూడా మొదలయ్యాయి. పర్యవసానాలు తెలియని యువ తను మొదట్లో ఇవి ఆకర్షించివుండొచ్చు. కానీ ప్రభుత్వ బలగాలు పకడ్బందీ వ్యూహాలు అమలు చేయటం ప్రారంభించాక ఆ సాయుధ చర్యలు వ్యతిరేక ఫలితాలిస్తాయి. సమస్యలెన్నివున్నా ప్రజలు మౌలికంగా శాంతియుత జీవనాన్ని కోరుకుంటారు. నిత్యం ఉద్రిక్త తల నడుమ అనిశ్చితిలో బతికే స్థితి ఉన్నప్పుడు దాన్నుంచి సాధ్యమైనంత త్వరగా బయటపడటా నికి ప్రయత్నిస్తారు. ప్రభుత్వాలు అణచివేత చర్యలతోపాటు వారి ప్రశాంతతకు హామీ ఇచ్చిన ప్పుడు సహజంగానే ఉద్యమాల వైపు మొగ్గు తగ్గుతుంది. మొదట్లో ఉన్నత చదువులు చదివినవారు భద్రమైన జీవితాన్నీ, బంగారు భవిష్యత్తునూ వదులుకుని ఆ ఉద్యమాల వైపు వెళ్లిన మాట వాస్తవం. అందుకు నిరుద్యోగం, ప్రభుత్వ వ్యవస్థల్లో పెరిగిన అవినీతి వంటివి కారణం అయ్యాయి. కానీ 1990వ దశకం చివరిలో ప్రపంచీకరణ తర్వాత మన దేశంలో పెట్టుబడులు వెల్లువలా రావటం, యువతకు మెరుగైన అవకాశాలు ఏర్పడటం మొదలయ్యాక ఉద్యమాల పట్ల విముఖత ఏర్పడింది. ఈ తరం విద్యార్థులు అటువైపు వెళ్లటం మాట అటుంచి, వారిలో అత్యధికులకు ఆ ఉద్య మాలపై కనీస అవగాహన కూడా లేదు. మావోయిస్టు ఉద్యమంలో కొత్త రిక్రూట్‌మెంట్ గణనీయంగా తగ్గి పోయిందని గణాంకాలు చెబుతున్నాయి. ఉద్యమంలో మధ్యతరగతి వర్గానికి బదులు ప్రస్తుతం ఆదివాసీల ప్రాబల్యం గతంతో పోలిస్తే పెరిగింది. కానీ దానికి సమాంతరంగా ఆదివాసీలను తమవైపు తిప్పుకోవటంలో భద్రతా బలగాలు సైతం విజయం సాధించగలిగాయి. నంబాల కేశవరావు తదితర ఉద్యమ నేతలు ఎన్‌కౌంటర్లలో మరణించటం ఆ పర్యవసానమే! వర్తమానంలో విస్తృతంగా అభివృద్ధి చెందిన సాంకేతికత సైతం బలగాలకు అందివచ్చింది. నక్సలిజాన్ని వచ్చే ఏడాది మార్చి ఆఖరుకల్లా అంతం చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తరచూ చెబుతున్నారు. జరుగుతున్న పరిణామాలు గమనిస్తే అది సాధ్యమేనన్న అభిప్రాయం కలుగుతుంది. ఏదేమైనా ఈ సమస్య హింసకు తావులేకుండా శాంతియుతంగా పరిష్కారమైతే సమాజం సంతోషిస్తుంది. అందుకు మావోయిస్టులు తమ పంథా మార్చుకుని సహకరించాలి. వారు పునరాలోచించుకునేందుకు కేంద్రం కూడా వ్యవధినివ్వాలి.

# ఆర్మీలోనూ 'ఆమె'పై వివక్షేనా




"భారత వైమానిక దళంలో మహిళలు రాఫెల్ యుద్ధ విమానాన్ని నడపగలిగినప్పుడు, వారిని ఆర్మీలో జడ్జి అడ్వకేట్ జనరల్(లీగల్) పోస్టుల్లోకి ఎందుకు తీసుకోవడం లేదు. మహిళలకు తక్కువ పోస్టులు ఎందుకు కేటాయించారు? ఎక్కువమంది మహిళలను తీసుకుంటే వచ్చిన నష్టమేంటి?" ఇవన్నీ సుప్రీంకోర్టు మొన్న బుధవారం కేంద్రానికి వేసిన ప్రశ్నలు. జెఎజి పోస్టుల్లో తమకు అన్యాయం జరిగిందని అషూర్‌కౌర్, అస్థత్యాగి అనే ఇద్దరు మహిళా అధికారులు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయగా జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం పైవిధంగా స్పందించింది. అంతేకాదు, ఈ పోస్టుల్లో మహిళలు తక్కువగా ఉండటం పట్ల విస్మయాన్ని వ్యక్తం చేసింది.ఆ పోస్టులకు ఫిఫ్టీ-ఫిఫ్టీ శాతం ప్రతిపాదికన ఎంపిక చేయడంలోని సహేతుకతను ప్రశ్నించింది. వీటిలో లింగ నిష్పత్తి వర్తించదనే నిబంధన ఉన్నప్పటికీ దాన్ని ఎందుకు అనుసరించడం లేదని నిలదీసింది. ఇది మహిళా సాధికారత గురించి గొప్పగా చెప్పుకునే కేంద్రానికి గొంతులో వెలక్కాయ పడ్డట్టైంది. నేడు అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణించడం చూస్తున్నాం. అనేక అవమానాల్ని, భరిస్తూ, అవహేళనల్ని అధిగమిస్తూ కుటుంబం కోసం కష్టపడటం, నిలబడటం ఈ పురుషాధిక్య సమాజంలో చిన్న విషయమేమి కాదు. వారికి చేయూత నందించి భరోసాగా నిలబడాల్సిన పాలక, అధికారగణం ఆ పనిచేయకపోగా, తొక్కిపెట్టేలా వ్యవహరిస్తున్న తీరు ఆందోళనాకరం. ఆర్మీలోని జడ్జి అడ్వకేట్ జనరల్ లీగల్ పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షలో మహిళ ఉద్యోగులిద్దరూ వరుసగా నాలుగు, ఐదు ర్యాంకులు సాధించారు. వీరిని అభినందించి ఒక మెట్టు ఎక్కించాల్సిన కేంద్ర సర్కార్ ఆ పనిచేయలేదు. పురుష అభ్యర్థులకన్నా మెరిట్‌లో పైచేయి సాధించినా మహిళా కోటాలో పోస్టులు లేవని చెప్పి వారిని తిరస్కరణకు గురిచేసింది. మొత్తం ఆరు పోస్టుల్లో మహిళలకు మూడు ఖాళీలు మాత్రమే ఉన్నాయని తెలిపింది. ఇది మహిళల పట్ల కేంద్రం వివక్షను తేటతెల్లం చేస్తున్నది. ఒక రకంగా జెండర్ సమస్యను ముందుకు తెచ్చి వారిని అవమానపరుస్తున్నది. పైగా పురుష లకు, స్త్రీలకు సమానమైన కోటా ఉన్న పోస్టుల్లో ఖాళీలు లేవని చెప్పడం మరీ వివక్షాపూరితం. అందుకే "పురుషులు, స్త్రీల ఆధారంగా ఖాళీలను విభజించడం వలన అధిక అర్హత కలిగిన అభ్యర్థులను తీసుకోనప్పుడు లింగ తటస్థ పోస్టులని ఎందుకు పిలుస్తారని' కోర్టు కేంద్రాన్ని గట్టిగానే నిలదీసింది, తీర్పును రిజర్వు చేసింది. మాట మాట్లాడితే మహిళలను గౌరవిస్తున్నామని, అన్నిరంగాల్లో పెద్దపీట వేస్తున్నామని, అభివృద్ధికి సహాయ సహకారాలందిస్తున్నామని మోడీతో పాటు ఆయన పరివారమంతా పలు వేదికల్లో ప్రగల్భాలు పలుకుతున్నది. ఇండియాకు ఎన్నో పతకాలు సాధించిన మహిళా రెజ్లర్ల పరిస్థితిని చూశాం కదా! పారిస్ ఒలింపిక్ గేమ్స్‌లో జరిగిందేమిటి? విజేతకు అడుగు దూరంలో ఉన్న రెజ్లర్ వినేష్ ఫోగట్ వెయిట్ ఎక్కువగా ఉందని సెలక్షన్ కమిటీ రిజక్ట్ చేసింది. దీని వెనుక మోడీ హస్తముందని అప్పట్లోనే అనేక విమర్శలొచ్చాయి. మహిళలకు సమానత్వ హక్కుపై రాజ్యాంగం అనేక అంశాల్ని పొందుపర్చింది. వాటిని అమలు చేయకపోగా వాటిని విస్మరించే కుట్రలు చేయడం నిజంగా ఆక్షేపణీయం. ఇదొక్కటే కాదు ప్రతి ఎంపికలోనూ స్త్రీల సమానత్వం కొరవడుతున్నది. ఇండియన్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో మహిళల ఉద్యోగ నియామక ప్రక్రియ, ఎన్సీసీ స్పెషల్ ఎంట్రీ స్కీమ్‌లో పురుషులకు డెబ్బయి ఆరు పోస్టులు కేటాయిస్తే మహిళలకు కేటాయించింది కేవలం ఆరు మాత్రమే. మహిళల్ని అభివృద్ధి చేయడం, వారిని అగ్రస్థానంలో నిలబెట్టడమంటే ఇదేనా? ఇంజినీరింగ్ చదివిన అవివాహితుల నియామకాలకు సంబంధించి రక్షణ రంగం ఇటీవల ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో మూడువందల డెబ్బయి తొమ్మిది టెక్ పోస్టులకు గాను మహిళలకు కేటాయించింది. ఇరవై ఆరు మాత్రమే. ఇలా ఎందులో చూసిన మహిళల కోటా నామమాత్రంగా ఉంటున్నది. మొత్తం భారత సైన్యంలో క్రియాశీల ఉద్యోగులు పన్నెండు లక్షల పైచిలుకు మంది ఉంటే అందులో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగుల సంఖ్య ఏడు వేలు మాత్రమే. మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు దక్కడం లేదని ఈ గణాంకాలను చూస్తేనే అర్థమవుతున్నది. నిన్న సుప్రీంకోర్టు జడ్జిగా రిటైరైన బేలా త్రివేదికి కనీసం ఫేర్‌వెల్ పార్టీ కూడా ఏర్పాటు చేయకుండా ఇంటికి సాగనంపింది సర్కార్. మహిళల పట్ల కాషాయ నేతల దృష్టిలోపానికి ఇదొక మచ్చుతునక. మహిళల గౌరవాన్ని కిందకు దిగజార్చడం పతనావస్థకు పరాకాష్ట.

సూర్య తెలుగు దిన పత్రిక

సంపాదకీయం

# మావోలకు పెద్ద దెబ్బ

## (విశ్లేషణ)

విస్తీర్ణంలో చాలా దేశాలతో పోలిస్తే ఎంతో పెద్దదైన మధ్య భారతంలో కొన్ని దశాబ్దాలుగా సాగు తున్న వామపక్ష తీవ్రవాదం క్షీణిస్తున్న జాడలు గత కొన్నేళ్లుగా కనబడుతుండగా... మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. అబూజ్‌మఢ్ అడవుల్లో జరిగిన ఆ ఎన్‌కౌంటర్‌లో ఆయనతోపాటు మరో 26 మంది నక్సలైట్లు చనిపోయారని, వారిలో పలువురు కీలక నేతలు ఉండొచ్చని అధికారిక ప్రకటన చెబుతోంది. ఇరుపక్షాల మధ్యా జరిగిన కాల్పుల్లో భద్రతా బలగాల్లోని ఒక జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోగా, మరికొంతమంది గాయపడ్డారని అధికారిక కథనం. ప్రధాన కార్య దర్శి స్థాయి నేత మరణించటం మావోయిస్టు పార్టీకి నిస్సందేహంగా కోలుకోలేని దెబ్బ. అందుకే కావొచ్చు... ఈ ఎన్‌కౌంటర్ గర్వించదగ్గ విజయమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివాసీల హక్కుల కోసం, దోపి%ఎ%¯ నిరోధానికీ ఆయుధం పట్టామని చెబుతున్న మావోయిస్టులు ఇన్ని దశాబ్దాల పోరాటంలో తమ చర్యల పర్యవసానాలనూ, వాటి నిరర్థకతనూ గమనించి సరిచేసుకోలేకపోయారని అర్థమవుతుంది. నక్సలైట్ ఉద్యమం పూర్వాపరాలు గమనిస్తే అదెప్పుడూ పడుతూ లేస్తూనే సాగింది. కానీ తమ పోరాటాలపై రాజ్యం ప్రతిసారీ ఎందుకు పైచేయి సాధించ గలుగుతున్నదన్న అంశంపై వారు దృష్టి పెట్టినట్టు లేదు. అంతకుముందు దేశంలో చెదురుమదురుగా జరిగిన సాయుధ పోరాటాలు అంతరించాయనుకుంటున్న తరుణంలో 1967లో పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లా సిలిగుడి డివిజన్‌లో మారుమూల గ్రామమైన నక్సల్బరీలో రాజు కున్న ఉద్యమం వేగంగా విస్తరించి సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావానికి దారితీసింది. మూడేళ్ల లోపునే పోలీసులు ఆ ఉద్యమాన్ని అణిచేయగలిగారు. దానివెంబడే అప్పటి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో వెల్లువెత్తిన ఉద్యమం సైతం ఎన్‌కౌంటర్ల పరంపర తర్వాత మూడేళ్లకే సద్దుమణిగింది. తిరిగి మరో ఆరేళ్లకు ఉత్తర తెలంగాణలో తలెత్తి విస్తరించిన ఉద్యమం ఒక్కటే దీర్ఘకాలం సాగిందనుకోవాలి. ఈ మూడు చోట్లా ఒకేవిధంగా మొదట్లో మధ్యతరగతి, మేధావి, విద్యార్థి వర్గాలను ఆకర్షించిన ఉద్యమాలు అనంతర కాలాల్లో ఆ వర్గాలకు ఎందుకు దూరమయ్యాయన్న విశ్లేషణను మావోయిస్టులు చేసుకోలేదని వారి ఆచరణ తీరు గమనిస్తే అర్థమవుతుంది. మరోపక్క నక్సల్ ఉద్యమం చీలికలూ, పేలికలూ అయింది. సీపీఐ (ఎంఎల్) భిన్నవర్గాలుగా విడిపోయింది. లిబరేషన్ వంటి పార్టీలు పార్ల మెంటరీ పంథాకు మళ్లి చెప్పుకోదగ్గ విజయాలు సాధిస్తున్నాయి. పాలకులెవరైనా ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయటానికీ, ప్రభుత్వ విధా నాలు సక్రమంగా లేవనుకుంటే ప్రజల్ని కూడగట్టి ఉద్యమించటానికీ ఎప్పుడూ అవకాశాలుంటాయి. 2014లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక భూసేకరణ చట్టం సవరించినప్పుడూ, అనంతర కాలంలో సాగు చట్టాలు తీసుకొచ్చినప్పుడూ రైతాంగం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.చివరకు కేంద్రం ఆ చర్యల్ని వెనక్కి తీసుకోక తప్పలేదు. మావోయిస్టు పార్టీ వీటిని గమనంలోకి తీసుకుందా? అంతక్రితం 1977 తర్వాత ఉద్యమాల్లోకి ప్రజల్ని కూడగట్టడంలో విజయం సాధించినా అటుపై ఆ ఉద్యమాలకు తోడు సాయుధ చర్యలు కూడా మొదలయ్యాయి. పర్యవసానాలు తెలియని యువ తను మొదట్లో ఇవి ఆకర్షించివుండొచ్చు. కానీ ప్రభుత్వ బలగాలు పకడ్బందీ వ్యూహాలు అమలు చేయటం ప్రారంభించాక ఆ సాయుధ చర్యలు వ్యతిరేక ఫలితాలిస్తాయి.సమస్యలెన్నివున్నా ప్రజలు మౌలికంగా శాంతియుత జీవనాన్ని కోరుకుంటారు. నిత్యం ఉద్రిక్త తల నడుమ అనిశ్చితిలో బతికే స్థితి ఉన్నప్పుడు దాన్నుంచి సాధ్యమైనంత త్వరగా బయటపడటా నికి ప్రయత్నిస్తారు. ప్రభుత్వాలు అణచివేత చర్యలతోపాటు వారి ప్రశాంతతకు హామీ ఇచ్చిన ప్పుడు సహజంగానే ఉద్యమాల వైపు మొగ్గు తగ్గుతుంది. మొదట్లో ఉన్నత చదువులు చదివినవారు భద్రమైన జీవితాన్నీ, బంగారు భవిష్యత్తునూ వదులుకుని ఆ ఉద్యమాల వైపు వెళ్లిన మాట వాస్తవం.అందుకు నిరుద్యోగం, ప్రభుత్వ వ్యవస్థల్లో పెరిగిన అవినీతి వంటివి కారణం అయ్యాయి. కానీ 1990వ దశకం చివరిలో ప్రపంచీకరణ తర్వాత మన దేశంలో పెట్టుబడులు వెల్లువలా రావటం, యువతకు మెరుగైన అవకాశాలు ఏర్పడటం మొదలయ్యాక ఉద్యమాల పట్ల విముఖత ఏర్పడింది. ఈ తరం విద్యార్థులు అటువైపు వెళ్లటం మాట అటుంచి, వారిలో అత్యధికులకు ఆ ఉద్య మాలపై కనీస అవగాహన కూడా లేదు. మావోయిస్టు ఉద్యమంలో కొత్త రిక్రూట్‌మెంట్ గణనీయంగా తగ్గి పోయిందని గణాంకాలు చెబుతున్నాయి.ఉద్యమంలో మధ్యతరగతి వర్గానికి బదులు ప్రస్తుతం ఆదివాసీల ప్రాబల్యం గతంతో పోలిస్తే పెరిగింది. కానీ దానికి సమాంతరంగా ఆదివాసీలను తమవైపు తిప్పుకోవటంలో భద్రతా బలగాలు సైతం విజయం సాధించగలిగాయి. నంబాల కేశవరావు తదితర ఉద్యమ నేతలు ఎన్‌కౌంటర్లలో మరణించటం ఆ పర్యవసానమే! వర్తమానంలో విస్తృతంగా అభివృద్ధి చెందిన సాంకేతికత సైతం బలగాలకు అందివచ్చింది.నక్సలిజాన్ని వచ్చే ఏడాది మార్చి ఆఖరుకల్లా అంతం చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తరచూ చెబుతున్నారు. జరుగుతున్న పరిణామాలు గమనిస్తే అది సాధ్యమేనన్న అభిప్రాయం కలుగుతుంది. ఏదేమైనా ఈ సమస్య హింసకు తావులేకుండా శాంతియుతంగా పరిష్కారమైతే సమాజం సంతోషిస్తుంది. అందుకు మావోయిస్టులు తమ పంథా మార్చుకుని సహకరించాలి. వారు పునరాలోచించుకునేందుకు కేంద్రం కూడా వ్యవధినివ్వాలి.

## కరోనా కొత్త వేరియంట్ అంత భయానకమా..?

# తెలుగు రాష్ట్రాల్లో తొలి కేసు నమోదు!



కరోనా కొత్త వేరియంట్ నిజంగానే అంత భయానకమా..? మళ్లీ క్వారెంటైన్ కష్టాలు తప్పవా..? పరిస్థితి లాక్‌డౌన్‌కు దారితీస్తుందా? అనే భయాల కంటే ముందుగా గుర్తొచ్చేది కొవిడ్ బూస్టర్ వ్యాక్సిన్. కానీ.. బూస్టర్ వెయ్యించుకోవాలా వద్దా అనేది కూడా ఇప్పుడు ప్రపంచ సమస్యగా మారింది. ఔను.. కోవిడ్ వ్యాక్సినేషన్‌తో గుండెపోటు వచ్చే ఛాన్సుందట. ఐదేళ్ల కిందట ప్రపంచాన్ని కుదిపేసిన పీడకల కొవిడ్-19.. నేను బతికే ఉన్నా అంటూ అడపాదడపా హెచ్చరిస్తూనే ఉంది. వారం రోజులుగా ఆసియన్ కంట్రీస్‌లో టెర్రర్ పుట్టిస్తోంది. మనదాకా రాలేదుగా అనుకుంటుండగానే భారత్‌లో పాజిటివ్ కేసుల సంఖ్య అమాంతం పెరుగుతూ.. కొవిడ్ భయాన్ని మళ్లీ పరిచయం చేస్తోంది. ప్రస్తుతం మన దేశంలో 250కి పైగా యాక్టివ్ కేసులున్నాయి. కేరళ, తమిళనాడు, మహారాష్ట్రలో పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. గతంలోలాగే ఈ సీజన్‌లో కూడా కొవిడ్ ఫియర్‌లో కేరళ రాష్ట్రమే ముందుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. ఎటువంటి పరిస్థితికైనా సిద్ధమవ్వాలని అని స్వయానా కేరళ ఆరోగ్య మంత్రే హెచ్చరించారు. పాండిచ్చేరి, ఢిల్లీ, గుజరాత్, రాజస్థాన్, సిక్కిం, హర్యానా, కర్ణాటక, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు సైతం అటెన్షన్ మోడ్‌లోకి వచ్చేశాయి. తెలుగురాష్ట్రాల్ని కూడా ఎలర్ట్ చేసింది కొవిడ్ ఫియర్. పొరుగు రాష్ట్రాల్లో కేసుల సంఖ్య పెరగడంతో స్పెషల్ అడ్వైజరీ జారీ చేసింది ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ. వీలైనంతవరకు పార్టీలు, ఫంక్షన్లు, ప్రార్థనలకు దూరంగా ఉండాలి. రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, ఎయిర్‌పోర్ట్‌ల్లో మాస్క్ వేసుకోవడం భౌతిక దూరం పాటించడం తప్పనిసరి. 60 ఏళ్లు పైబడిన వాళ్లు, గర్భవతులు ఇంట్లోంచి బైటికి రావద్దు. తరచూ చేతులు కడుక్కోవాలి, జ్వరం, దగ్గు, గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే కోవిడ్ టెస్ట్ చేయించుకోవాలి. అనారోగ్యంగా ఉంటే బైటకు వెళ్లకండి.. అని సూచించింది ఏపీ హెల్త్ డిపార్ట్‌మెంట్. పరీక్షల కోసం ల్యాబ్స్ సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్యాధికారుల్ని అప్రమత్తం చేసింది కూడా. ఈ ఏడాది జనవరిలో మహారాష్ట్ర కోవిడ్ సంబంధిత సమస్యలతో ఇద్దరు మరణించారు. వీళ్లకు మిగతా అనారోగ్య సమస్యలు కూడా ఉండడంతో అప్పట్లో తేలిగ్గా తీసుకున్నాయి ప్రభుత్వాలు. ఇప్పుడు కూడా మిగతా ఆసియా దేశాలతో పోలిస్తే భారత్‌లో ఆందోళన పడాల్సిన పనే లేదు. ఎందుకంటే.. ఒక్క హాంకాంగ్‌లోనే 30మందికి పైగా చనిపోయారు. థాయ్‌లాండ్‌లో ఏప్రిల్ నుంచే కొవిడ్ టెర్రర్ ఉంది. ఒక్క బ్యాంకాక్‌లోనే ఆరువేల కేసులు నమోదయ్యాయి. మన దేశపు జనాభాతో పోలిస్తే ప్రస్తుతమున్న కేసుల సంఖ్య చాలా తక్కువ. అంతమాత్రాన కరోనా ఉనికి లేదని ఊపిరి పీల్చుకోడానికి లేదు. ఎందుకంటే.. టెస్టుల సంఖ్యను బట్టే కేసుల సంఖ్య ఆధారపడి ఉంటుంది. కొవిడ్ సంకేతాలు కనిపించగానే టెస్టుల కోసం క్యూ కట్టే పరిస్థితి ఇంకా మన దేశంలో లేదు. ఇప్పుడు సర్క్యులేషన్‌లో ఉన్న వైరస్.. ఒమిక్రాన్ ఫ్యామిలీలోని జేఎన్1 అనే వేరియంట్ నుంచి వచ్చిన సబ్‌వేరియంట్. ఒరిజినల్ వైరస్‌తో పోలిస్తే, దీని తీవ్రత చాలాచాలా తక్కువ. థర్డ్ వేవ్‌లో వచ్చిన ఒమిక్రాన్ వేరియంటే అప్పట్లో పెద్దగా ప్రభావం చూపలేదు. తాజా వేరియంట్‌తో పెద్దగా భయపడాల్సిన అవసరం లేనట్టే..! 100 మందికి వైరస్ సోకితే ఐదుగురు కూడా ఆస్పత్రిలో చేరే అవసరం రాదు. కానీ.. కొవిడ్ ఉనికి తీవ్రతను బట్టి దేశాలన్నీ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నదీ ప్రపంచ ఆరోగ్య సంస్థ గైడ్‌లైన్. అందుబాటులో ఉన్నంత మాత్రాన బూత్రాన స్టర్ వ్యాక్సిన్ వేసుకోవచ్చా..? అనేది కొత్తగా పుట్టిన భయం. ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ FDA.. కొవిడ్ వ్యాక్సిన్ రెగ్యులేషన్స్‌ని మార్చేసింది. 65 ఏళ్లు పైబడినవాళ్లు మాత్రమే బూస్టర్ షాట్స్ తీసుకోడానికి అర్హులని తేల్చింది. ఇంతకంటే భయపెట్టే విషయం ఏంటంటే.. వ్యాక్సినేషన్ తర్వాత గుండెసంబంధిత వ్యాధులు రావొచ్చని హెచ్చరిస్తోంది FDA. ఈ మేరకు లేబుల్ మీద వార్నింగ్ ఇవ్వాలని వ్యాక్సిన్ తయారీ కంపెనీలను ఆదేశించింది కూడా. సో.. బూస్టర్ వ్యాక్సిన్ వేసుకుందాం.. కొవిడ్ బారిన పడకుండా తప్పించుకుందాం అని ఆశపడితే గుండెపోటుకు దొరికిపోయే ఛాన్సు ఉంది. తస్మాత్ జాగ్రత్త..!

# ప్రపంచం గందరగోళానికి కారణం అమెరికానే.. జైశంకర్ సంచలన వ్యాఖ్యలు!



ప్రపంచం ప్రస్తుతం ఎన్నడూ లేని విధంగా ఒక గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటోందని, దానికి ఓ రకంగా అమెరికానే కారణమని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. యూరప్ మూడు దేశాల పర్యటనలో ఉన్న ఆయన, నెదర్లాండ్స్‌లో మాట్లాడుతూ ఈ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఉగ్రవాదంపై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్', పాకిస్తాన్ ఉగ్రవాదం, ఉక్రెయిన్-గాజా యుద్ధాలు, అమెరికా వాణిజ్య యుద్ధం, కాశ్మీర్ సమస్య వంటి అనేక కీలక అంశాలపై ఆయన తన అభిప్రాయాలను స్పష్టం చేశారు. ప్రపంచం బహుళ ధ్రువాలుగా మారుతుందని ఆసియా ఎదుగుదలపై ఆయన ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. పొలిటికెన్‌కు ఇచ్చిన ఒక ముఖ్యమైన ఇంటర్వ్యూలో, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ డెన్మార్క్‌పై తన ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రపంచం ప్రస్తుతం ఒక అస్తవ్యస్తమైన దశ గుండా వెళుతోందని, ప్రపంచవ్యాప్తంగా అస్థిరత నెలకొందని అన్నారు. గాజా, ఉక్రెయిన్‌లో విధ్వంసకర యుద్ధాలు జరుగుతున్నాయి. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ప్రపంచ వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించింది. చైనా తైవాన్‌ను బెదిరిస్తోంది. అదే సమయంలో భారతదేశం, పాకిస్తాన్ తీవ్రమైన సైనిక సంఘర్షణ తర్వాత ఉత్కంఠగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అన్ని పరిణామాల తర్వాత కూడా ప్రపంచం మళ్లీ సమతుల్యం అవుతోందని జైశంకర్ అన్నారు. ప్రపంచం పాశ్చాత్య దేశాల ప్రభావం నుంచి బయటపడుతూ మరింత వైవిధ్యంగా, మరింత ప్రపంచీకరణ చెందుతూ చాలా వరకు మరింత ఆసియా ప్రాబల్యం పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

మరో కార్యక్రమంలో "పాకిస్తాన్ ఉగ్రవాదానికి కేంద్రం అని మీరు గతంలో కూడా అన్నారు. అక్కడ ఉన్న ఉగ్రవాద సంస్థలకు పాకిస్తాన్ ప్రభుత్వం మద్దతు ఇస్తోందని అన్నారు. ఇప్పుడు కూడా అదే మాటపై నిలబడతారా?" అని మంత్రి జైశంకర్ కు ఓ ప్రశ్న ఎదురైంది. ఈ ప్రశ్నకు జైశంకర్ స్పందిస్తూ.. "అవును, నేను ఇదివరకే చెప్పాను, ఇప్పుడు చెబుతున్నాను" అని స్పష్టం చేశారు. ఆయన ఉదాహరణలతో వివరించారు. జైశంకర్ తన ప్రసంగంలో భారత్ ఉగ్రవాదంపై చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' గురించి కూడా ప్రస్తావించారు. ఇది భారతదేశం తన భద్రత విషయంలో ఎంత కట్టుబడి ఉందో స్పష్టం చేస్తుందని అన్నారు. కాశ్మీర్ అంశంపై కూడా ఆయన భారత్ వైఖరిని పునరుద్ఘాటించారు. అంతర్జాతీయ సంబంధాలలో ముఖ్యంగా ఆసియా ఆర్థిక, రాజకీయ శక్తిగా ఎదగడం ప్రపంచ భవిష్యత్తును ఎలా ప్రభావితం చేస్తుందో ఆయన వివరించారు. ఈ సంక్లిష్ట ప్రపంచ పరిస్థితుల్లో భారతదేశం ఒక కీలకమైన, బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తుందని ఆయన నొక్కి చెప్పారు.

# ఉగ్రవాదానికి తలవంచని భారత్



ఉగ్రవాదం అనే పదం ఊహాజనిత భయం కాదు. దేశాన్ని భయకంపితమయ్యేలా చేయాలన్న కుయుక్తి. ఇది టీవీ డిబేట్లలో మాట్లాడుకునే రాజకీయ సమస్య కాదు. ఇది నిత్యం మన సరిహద్దుల్లో, నగరాల్లో, నిశ్శబ్దంగా విరుచుకుపడే ఉగ్ర పీడ. 1985 నుంచి నేటి వరకు జరుగుతూ వచ్చిన వరుస ఉగ్రదాడులు ఈ దేశాన్ని కల్లోలంలో ముంచెత్తాయి.. కానీ మనం తలవంచలేదు. తలెత్తుకుని నిలబడ్డాం. దేశంలో అశాంతి చేలరేగేలా చేసేవారి కుట్రలు ప్రతిసారీ విఫలమవుతూనే ఉన్నాయి. అట్లాంటిక్ గగనతలంలో 1985లో జరిగిన 'ఎయిర్ ఇండియా కనిష్క' పేలుడు నుంచి.. మొన్నటికి మొన్న బైసరాన్ వ్యాలీలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి వరకు, ఈ దేశం ఎన్నో చీకటి దుర్మార్గాలను చూసింది, తట్టుకుంది. భారత దేశంపై ఉగ్రదాడులు యాదృచ్ఛికంగా జరగలేదు. అవి సంస్థాగతంగా, సుదీర్ఘంగా ప్రణాళికాబద్ధంగా జరిగాయి. 1991లో రాజీవ్ గాంధీ హత్య, 1993 ముంబయి పేలుళ్లు, 2001లో పార్లమెంటుపై దాడి, 2008లో ముంబయి 26/11 ఉగ్ర హత్యలు, ప్రతి దాడి మన దేశ మనోబలాన్ని పరీక్షించాయి. కానీ మనం తలవంచలేదు. తలెత్తుకుని నిలబడ్డాం.

### ప్రతి ఒక్క దాడి తర్వాత..

2016 ఉరీ దాడి, 2019 పుల్వామా ఘటనలు దేశవ్యాప్తంగా కల్లోలాన్ని కలిగించాయి. కానీ మనదేశం వెంటనే స్పందించి పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్ ద్వారా దేశ శక్తిని మాత్రమే కాదు, నైతిక పటిష్టతను కూడా ప్రపంచానికి చాటింది. తాజాగా గత నెల 22న మరో ఘోర దుర్ఘటన పహెల్గాం వద్ద బైసరాన్ వ్యాలీలో ఉగ్రదాడి చరిత్రలో నిలిచిపోయే ఓ మానవీయ విషాదం. ఈ ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు చనిపోయారు. అయినప్పటికీ, మన దేశ సంకల్పాన్ని ఇవి దెబ్బతీయలేకపోయాయి. వారు చేసిన దాడి తర్వాత మన 'ఆపరేషన్ సిందూర్' ప్రతిదాడి తీవ్రత ఎక్కువగానే ఉంది. పహెల్గాం దాడికి సంబంధించిన ఆ ఉగ్రవాదులను మనం పట్టుకోలేకపోయినా, పాక్ ఉగ్ర స్థావరాలపై మన బలగాలు జరిపిన ప్రతీకార చర్య ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఇద్దరు మహిళల నేతృత్వంలో జరిగిన ఈ వ్యూహాత్మక దాడి, భారత సైనిక సామర్థ్యాన్ని మాత్రమే కాదు, భారత మహిళా శక్తిని కూడా చాటింది. ఈ దాడికి దేశమంతా ఐక్యంగా ప్రభుత్వానికి మద్దతు పలికింది. పార్టీలకతీతంగా విపక్ష నేతలంతా కేంద్ర ప్రభుత్వానికి వెన్ను దన్నుగా నిలిచారు. దౌత్య ఫలితంగా అంతర్జాతీయంగా మనకు మద్దతు లభించింది.

### ఉగ్రవాదానికి మతం ఉండదు!

భయం ముందు తలవంచని మన శక్తే దేశానికి నిజమైన రక్షణ కవచం. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారి త్యాగాలు వ్యర్థం కావు. వాళ్ల తుది నిశ్వాసలో మన భద్రత ఉంది. మన శ్వాసల్లో వాళ్ల ఆశయం ఉంది. ప్రతి భారతీయుడి చేతిలో తుపాకీ లేకపోయినా, మన కర్తవ్యంలో జాగృతంగా ఉండే ప్రతి క్షణం ఉగ్రవాదాన్ని ఎదిరించే ముందడుగు. దాన్ని మౌనంగా అంగీకరించడం కాదు, ఖండించడం అవసరం. ప్రతిసారీ మనం చుట్టూ జరుగుతున్న అసహనాన్ని, విద్వేషాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉంటుంది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం అంటే, అది విలువల కోసం జరిగే పోరాటం. శాంతిని, మానవతను, సహజీవనాన్ని ప్రతిష్టించే ఈ పోరాటంలో మన ప్రతి ఆలోచన, ప్రతి చర్య కూడా ఆయుధమే. మన పాఠశాలల బోధనలో, కుటుంబాల సంస్కారాల్లో, రాజకీయ చైతన్యంలో ఈ విషయం చెప్పాలి. మతాన్ని, భాషను, వర్గాన్ని ఆయుధంగా వాడే కుట్రలకు మనం బలి కాకూడదు. నిజానికి ఉగ్రవాదానికి మతం ఉండదు. మాలేగావ్, మక్కా మసీదు, అజ్మీర్ దర్గా, సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌ల్లో జరిగిన అమానవీయ దాడులే దీనికి నిదర్శనం. అజ్మల్ కసబ్ అయినా, అసిమానంద స్వామి అయినా, ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ అయినా అజర్ మసూద్ అయినా ఇలాంటి భావజాలం కలిగిన వారందరూ ఒకే తాను ముక్కలు, మతోన్మాద, ఉగ్రవాదులు.. మానవత్వానికి వ్యతిరేకమైన హింసా ప్రవృత్తికి ఉదాహరణలు..

### ఆలోచనలతోనే మార్పు సాధ్యం!

ఈ దేశ సమగ్రతను కాపాడడానికి ఇటువంటి అన్ని రకాల, అన్ని రూపాల ఉగ్రవాదాలకు వ్యతిరేకంగా నిలబడే ధైర్యం మనకు అవసరం. అది మాత్రమే నిజమైన జాతీయత. మతం, భాష, జాతి పేరుతో భయాన్ని వ్యాపింపజేసే వారు ఎవరైనా వారిని వ్యతిరేకించాలి. రాజకీయ నాయకులు ప్రజల్లో అసహనాన్ని రెచ్చగొట్టే మాటలకు బదులుగా, సమాజాన్ని కలుపుకుపోయే సంస్కారాన్ని పెంపొందించాలి. శాంతి అనేది ఆయుధాలతో కాదు, ఆలోచనల మార్పుతో సాధ్యమవుతుంది. అందుకే మానవతా విలువలతోనే ఉగ్రవాదాన్ని ఓడించాలి. ఉగ్రవాదం మన దేశాన్ని ఎప్పటికీ కదిలించలేదు. అటువంటి విధ్వంసక శక్తులతో పోరాడి ఓడించే శక్తి మన దేశానికి ఉంది. ఇంకోసారి ఉగ్రవాదాడి జరిగితే భారత్ ఎప్పటికీ తలవంచదని చూపించాలి.

# రిటైర్మెంట్ ఇచ్చేసిన లంకేయుల మెయిన్ పిల్లర్!

## ఆ రోజే తుది మ్యాచ్ అంటూ.. ఎమోషనల్ పోస్ట్



శ్రీలంక క్రికెట్‌లో ఒక శకం ముగిసింది. దేశపు సీనియర్ క్రికెటర్, ప్రతిభావంతుడు ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ నిర్ణయాన్ని అతను తన అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ అయిన %శ% ద్వారా వెల్లడించాడు.

మాథ్యూస్ రిటైర్మెంట్ వార్త క్రికెట్ అభిమానులందరినీ భావోద్వేగానికి గురిచేసింది, ఎందుకంటే అతను గత 17 సంవత్సరాలుగా శ్రీలంక టెస్ట్ క్రికెట్‌కు కీలకస్తంభంగా నిలిచాడు. వచ్చే నెల బంగ్లాదేశ్‌తో ప్రారంభమయ్యే టెస్ట్ సిరీస్‌లో తొలి మ్యాచ్ తరువాత టెస్ట్ ఫార్మాట్‌కి స్వస్తి చెబుతానని ప్రకటించాడు. అయితే, వైట్-బాల్ క్రికెట్‌కి అందుబాటులో ఉంటానని స్పష్టంగా పేర్కొన్నాడు.తన పోస్ట్‌లో మాథ్యూస్, దేశానికి 17 సంవత్సరాల పాటు శ్రద్ధగా సేవ చేయగలిగినందుకు గర్వంగా ఉందని, ఈ ప్రయాణంలో తన కుటుంబం, మిత్రులు, సహచరులు, అభిమానులు అందించిన అండతోనే ఇది సాధ్యమైందని హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశాడు. 2009లో పాకిస్థాన్‌తో గాలె టెస్ట్‌లో అరంగేట్రం చేసిన మాథ్యూస్, తన స్టైలిష్ బ్యాటింగ్, నిలకడగల టెక్నిక్‌తో చిరకాలం శ్రీలంక మిడిలార్డర్‌కు వెన్నెముకగా నిలిచాడు. మహేల జయవర్ధనే, కుమార్ సంగక్కర వంటి దిగ్గజుల రిటైర్మెంట్ తర్వాత దినేష్ చండిమాల్‌తో కలిసి జట్టును ముందుకు నడిపించాడు.

బౌలింగ్ విభాగంలో గాయాల కారణంగా పూర్తి స్థాయిలో నిపుణతను చూపలేకపోయినా, బ్యాటింగ్‌లో మాత్రం మాథ్యూస్ తన ప్రతిభను నిరూ పించాడు. 118 టెస్టుల్లో 44.62 సగటుతో 8167 పరుగులు చేసి, శ్రీలంకకు అనేక చిరస్మ రణీయ విజయాలు అందించాడు. ఇందులో 16 శతకాలు, 45 అర్ధశతకాలు ఉన్నాయి. అతని బాటింగ్‌లో స్పిన్, పేస్ బౌలింగ్‌లను సమర్థంగా ఎదుర్కొనే నైపుణ్యం స్పష్టంగా కనిపించింది. ఈ కారణంగా అతను ఆసియా ఉపఖండంలోని అత్యుత్తమ బ్యాటర్‌లలో ఒకడిగా గుర్తింపు పొందాడు.

ఏంజెలో మాథ్యూస్ రిటైర్మెంట్‌తో శ్రీలంక టెస్ట్ జట్టుకు ఓ అపూర్వమైన అధ్యాయం ముగిసినట్టే.

కానీ వైట్ బాల్ క్రికెట్‌లో ఇంకా సేవలు అందించనున్నట్టు తెలిపిన ఆయన నుంచి అభిమానులు మరిన్ని అద్భుత ప్రదర్శనలు ఆశిస్తున్నారు.

టెస్ట్ క్రికెట్‌లో మాథ్యూస్ పేరును శాశ్వతంగా గుర్తుంచుకునేలా అతను తన ఆటతీరుతో ముద్ర వేసుకున్నాడు.

# SPORTS

## ఇంగ్లండ్ టూర్‌కి ముందే
## భారత జట్టుకు షాకింగ్ న్యూస్.. టెస్ట్ సిరీస్ నుంచి బుమ్రా ఔట్?



: టీమిండియా పేస్ దళానికి వెన్నెముక అయిన జస్ప్రీత్ బుమ్రా.. రాబోయే ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌లో ఐదు మ్యాచ్‌లకు గాను కేవలం మూడు మ్యాచ్ లలో మాత్రమే పాల్గొనే అవకాశం ఉంది. బీసీసీఐ వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం, బుమ్రా పనిభారాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో బుమ్రా ఫిట్‌నెస్ సమస్యలతో సతమతమవుతున్న విషయం తెలిసిందే. 2024-25 ఆస్ట్రేలియా పర్యటనలోని చివరి టెస్టులో వెన్ను గాయం కారణంగా అతను కొన్ని నెలల పాటు ఆటకు దూరమయ్యాడు. ఛాంపియన్స్ ట్రోఫీ 2025, ఐపీఎల్ 2025లో ప్రారంభ మ్యాచ్‌లకు కూడా అతను అందుబాటులో లేడు. ఐపీఎల్‌లో తిరిగి మైదానంలోకి వచ్చినప్పటికీ, టెస్ట్ క్రికెట్‌కు అవసరమైన పూర్తి ఫిట్‌నెస్‌ను ఇంకా సాధించలేదని నివేదికలు సూచిస్తున్నాయి. ఇంగ్లాండ్‌లో ఐదు టెస్టుల సుదీర్ఘ సిరీస్ ఉండటం, టెస్ట్ క్రికెట్‌లో పేసర్లకు ఎక్కువ పనిభారం ఉండటం వంటి అంశాలను బీసీసీఐ పరిగణనలోకి తీసుకుంది. బుమ్రాకు మరోసారి గాయం కాకుండా, అతని కెరీర్‌ను సుదీర్ఘకాలం కొనసాగించడానికి ఈ పనిభార నిర్వహణ అవసరమని బోర్డు భావిస్తోంది. గతంలో కూడా బుమ్రా గాయాల కారణంగా కీలక సిరీస్‌లకు దూరమైన సందర్భాలు ఉన్నాయి. బీసీసీఐ అధికారులు మాట్లాడుతూ, ఐదు టెస్టుల సిరీస్‌లో కెప్టెన్, వైస్ కెప్టెన్ స్థిరంగా ఉండాలని కోరుకుంటున్నారని, బుమ్రా అన్ని మ్యాచ్‌లలో ఆడకపోవచ్చు కాబట్టి, వైస్ కెప్టెన్సీ బాధ్యతలను యువ ఆటగాళ్లకు అప్పగించే అవకాశం ఉందని తెలిపారు. శుభ్‌మన్ గిల్ లేదా రిషబ్ పంత్ వైస్ కెప్టెన్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయం భారత జట్టుకు ఒక సవాలుగా మారవచ్చు. ఇంగ్లాండ్ పిచ్‌లపై బుమ్రా అనుభవం, అతని బౌలింగ్ నైపుణ్యం జట్టుకు చాలా కీలకం. అయితే, అతని ఆరోగ్యాన్ని పరిరక్షించడం కూడా అంతే ముఖ్యం. బుమ్రా లేని మ్యాచ్‌లలో ఇతర పేసర్లు మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ వంటి వారికి ఎక్కువ బాధ్యత ఉంటుంది. మొత్తంమీద, జస్ప్రీత్ బుమ్రా ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌లో కేవలం మూడు మ్యాచ్‌లే ఆడనున్నట్లు బీసీసీఐ సమాచారం. ఈ నిర్ణయం అతని ఫిట్‌నెస్, పనిభారం నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తూ తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. భారత జట్టు మే 24 లేదా 25న ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌కు జట్టును ప్రకటించే అవకాశం ఉంది. అప్పుడు ఈ విషయాలపై పూర్తి స్పష్టత వస్తుంది.

# బీహార్ లో అడుగుపెట్టిన యంగ్ రాకెట్.. గ్రాండ్ వెల్కమ్ మామూలుగా లేదుగా!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025లో అద్భుతమైన ప్రదర్శనతో దేశవ్యాప్తంగా అభిమానులను మెప్పించిన యువ క్రికెట్ స్టార్ వైభవ్ సూర్యవంశీ, టోర్నమెంట్ ముగిసిన వెంటనే తన స్వస్థలమైన బీహార్‌కు తిరిగివచ్చాడు. అక్కడ అతనికి హృదయపూర్వకంగా, భావోద్వేగంగా ఘన స్వాగతం లభించింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, మిత్రులు అతనికి ఎదురెళ్లి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఆ క్షణాలు ఎంతో ప్రత్యేకమైనవిగా మిగిలిపోయాయి, ఎందుకంటే ఐపీఎల్ చరిత్రలో అరంగేట్రం చేసిన అతి పిన్న వయస్కుడిగా వైభవ్ వార్తల్లో నిలిచాడు.వైభవ్ రాజస్థాన్ రాయల్స్ తరఫున ఐపీఎల్‌లో అడుగుపెట్టి, కేవలం 14 ఏళ్ల వయసులోనే టీమ్‌కు ముఖ్యమైన ఆటగాడిగా మారాడు.

జట్టు మొత్తం సీజన్‌లో కేవలం 4 విజయాలు మాత్రమే సాధించగలిగినా, వైభవ్ తన విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రత్యేకంగా వెలుగులోకి వచ్చాడు. అతను ఆడిన 7 మ్యాచ్‌ల్లో 206 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో 252 పరుగులు చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ పరుగుల్లో 18 ఫోర్లు, 24 సిక్సర్లు, ఒక అద్భుతమైన సెంచరీ ఉన్నాయి. ఈ ప్రభంజనాత్మక బ్యాటింగ్ ఐపీఎల్ చరిత్రలో అతన్ని అత్యంత యువ సెంచరీ మాంత్రికుడిగా గుర్తించేందుకు కారణమైంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తన అరంగేట్రం సందర్భంగా, అతను తొలి బంతికే సిక్స్ కొట్టి 34 పరుగులతో ఆకట్టుకున్నాడు. కానీ అతను నిజంగా మెరిసిన పోటీ గుజరాత్ టైటాన్స్‌తో జరిగింది. ఆ మ్యాచ్‌లో అతను కేవలం 38 బంతుల్లో 101 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇది ఆయనను ఐపీఎల్‌లో సెంచరీ చేసిన అతి చిన్న వయస్కుడిగా నిలిపింది. ఈ అద్భుత ప్రదర్శన తర్వాత అతనికి 'బాస్ బేబీ వైభవ్' అనే బిరుదు కూడా వచ్చి చేరింది. రాజస్థాన్ రాయల్స్ అధికారికంగా విడుదల చేసిన వీడియోలో, వైభవ్ తన ఇంటి వద్ద కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి కేక్ కట్ చేస్తూ ఆనందంగా కనిపించాడు. కేక్‌పై "బాస్ బేబీ వైభవ్" అనే పదాలు ఉండగా, స్థానికులు అతని విజయాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఇది కేవలం వ్యక్తిగత గర్వం మాత్రమే కాకుండా, మొత్తం బీహార్ గర్వపడే క్షణంగా మారింది. అంతేకాదు, వైభవ్ ఇప్పుడు భారత అండర్-19 జట్టుకు %జు% ఎంపికయ్యాడు.

జూన్ 24 నుండి జూలై 23, 2025 వరకు ఇంగ్లాండ్ పర్యటనలో పాల్గొననున్న ఈ యువ క్రికెటర్, ఒక వార్మప్ మ్యాచ్‌తో పాటు ఐదు వన్డేలు, రెండు మల్టీ-డే మ్యాచ్‌లు ఆడనున్నాడు. ఇది అతని భవిష్యత్తు క్రికెట్ ప్రయాణానికి అద్భుతమైన మైలురాయిగా మారనుంది. బీహార్ నుంచి వచ్చిన ఈ బాలుడి విజయయాత్ర దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన యువతకు ప్రేరణగా నిలుస్తోంది.

# జనవరి 5 నుంచి హాకీ ఇండియా లీగ్




నోయిడా: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) 2026 సీజన్ వచ్చే ఏడాది జనవరి 5న ప్రారంభం కానుంది. ఈ మేరకు హాకీ ఇండియా (హెచ్ఐ) కార్యదర్శి భోళానాథ్ సింగ్ వివరాలు వెల్లడించారు. ఏడేళ్ల విరామం తర్వాత గతేడాది తిరిగి నిర్వహించిన హెచ్ఐఎల్‌కు మంచి ఆదరణ లభించగా ఈసారి మహిళల లీగ్‌లో మరో రెండు జట్లను పెంచనున్నట్లు భోళానాథ్ తెలిపారు. 'హెచ్ఐఎల్ వచ్చే సీజన్ తేదీలు ఖరారయ్యాయి. పురుషుల విభాగంలో 8 ఫ్రాంఛైజీలు యథావిధిగా పాల్గొంటుండగా... మహిళల విభాగంలో గత సీజన్‌లో పాల్గొన్న నాలుగు జట్లతో పాటు మరో రెండు జట్లు అదనంగా చేరనున్నాయి. వేదిక ఇంకా ఖరారు కాలేదు. విదేశీ ఆటగాళ్ల వెసులుబాటుకు తగ్గట్లే షెడ్యూల్‌ను జనవరి 5 నుంచి ప్రారంభిస్తున్నాం' అని భోళానాథ్ వెల్లడించారు. ఇక గత సీజన్‌కు సంబంధించి కొంత మంది ప్లేయర్లకు డబ్బులు చెల్లించలేదనే వార్తల్లో వాస్తవం లేదని కొట్టిపారేశారు. ఫ్రాంఛైజీలన్నీ హెచ్ఐఎల్ నియమావళిని పాటిస్తున్నాయని తెలిపారు. హాకీ ప్లేయర్లు చదువు కొనసాగించేందుకు వీలుగా అమిటీ యూనివర్సిటీతో హాకీ ఇండియా ఎంఓయూ కుదుర్చుకుంది. దీని ద్వారా ప్లేయర్లు ఎక్కడి నుంచి అయినా ఆన్‌లైన్ ద్వారా తమ చదువు కొనసాగించే అవకాశం దక్కింది.

కేంద్ర ప్రభుత్వానిదే తుది నిర్ణయం

మరోవైపు భారత్ వేదికగా ఈ ఏడాది చివర్లో జరగనున్న ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో పాకిస్తాన్ పాల్గొనే అంశంలో తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వానిదే అని హాకీ ఇండియా వెల్లడించింది. ప్రభుత్వం సూచనల మేరకే నడుచుకుంటామని వెల్లడించింది.

# కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్.. ఓపెనర్‌గా రోహిత్ స్థానంలో ఎవరంటే?

ఇంగ్లండ్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ సెలెక్టర్లు శనివారం ప్రకటించ నున్నారు. రోహిత్ శర్మ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటిం చిన నేపథ్యంలో ఎవరికి సారథ్య బాధ్యతలు అప్పగి స్తారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.టెస్ట్ కెప్టెన్సీ రేసులో శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా పోటీలో ఉన్నారు. అయితే టీమిండియా టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలను గిల్‌కే అప్పగించేందుకు బీసీసీఐ సిద్ధ మైందని తెలుస్తోంది. ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్‌ను ప్లేఆఫ్స్ చేర్చడం అతడికి కలిసి రానుంది. దీనిపై మరికొన్ని గంటల్లో అధికారిక ప్రకటన రానుంది. ఆస్ట్రేలియా పర్యటనలో వైస్ కెప్టెన్‌గా ఉన్న జస్‌ప్రీత్ బుమ్రా రేసులో ఉన్నా.. ఫిట్‌నెస్ సమస్యల కారణంగా అతడికి కెప్టెన్సీ బాధ్యతలను అప్పగిం చేందుకు బీసీసీఐ సిద్ధంగా లేదని సమాచారం. దీర్ఘ కాలిక ఫిట్‌నెస్, పనిభారం నిర్వహణపై బీసీసీఐ ఆలో చన చేసినట్లు తెలుస్తోంది. ఈ రెండు శుభ్‌మన్ గిల్‌కు అనుకూలంగా మారాయి. ఐపీఎల్‌లో పేలవ ప్రదర్శన చేసినప్పటికీ టీమిండియా భవిష్యత్ కారణంగా సెలెక్టర్లు రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించే అవకాశాలు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా పంత్ భారత టెస్ట్ జట్టులో రెగ్యులర్ ఆటగాడిగా ఉన్నాడు. రోహిత్ శర్మ రిటైర్మెంట్ నేపథ్యంలో అతడి స్థానంలో యశస్వి జైస్వాల్‌తో కలిసి కేఎల్ రాహుల్ ఓపెనర్‌గా ఆడనున్నాడు. ఐపీఎల్ 2025లో పరుగుల వరద పారిస్తున్న సాయి సుదర్శన్ టాప్ మూడో స్థానంలో ఆడనున్నాడు. నాలుగో స్థానంలో గిల్ ఆడనుండగా.. ఆపై శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్, కరుణ్ నాయర్, సర్ఫరాజ్ ఖాన్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ధ్రువ్ జురెల్‌ను రిజర్వ్‌గా కొనసాగించనున్నారు. రవీంద్ర జడేజా భారత స్పిన్ విభాగానికి నాయకత్వం వహిస్తాడు. వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్‌లు జట్టులో ఉండవచ్చు. పేస్ విభాగంలో జస్ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్ పక్కా. మహమ్మద్ షమీ ఫిట్‌నెస్‌పై సందేహాలు ఉన్నాయి. ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాష్ దీప్, అర్ష్‌దీప్ సింగ్‌లలో ఇద్దరు ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయి.



# ఇంగ్లాండ్ సిరీస్‌కు ముందు గంభీర్‌కు ఊహించని షాక్



## ఈ సీనియర్ ఆటగాళ్లు టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడంతో సెలక్టర్లకు జట్టు కూర్పు తలనొప్పిగా మారింది.

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లేకుండానే ఈ సారి టీమిండియా ఇంగ్లాండ్ లో పర్యటించనుంది. ఈ సీనియర్ ఆటగాళ్లు టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడంతో సెలక్టర్లకు జట్టు కూర్పు తలనొప్పిగా మారింది. ముఖ్యంగా కెప్టెన్‌పై సెలెక్టర్లు ఓ నిర్ణయానికి రాలేకపోతున్నారు. ఇదిలా ఉంటే.. సీనియర్లు లేని జట్టులో మరో ఇద్దరు సీనియర్లు జట్టుకు దూరం కానున్నట్లు నివేదికలు చెప్తున్నాయి. ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌కు మహ్మద్ షమీ దూరం అయ్యే అవకాశముంది. షమీ ఫిట్నెస్ పై వచ్చిన నివేదిక దృష్ట్యా సెలెక్టర్లు షమీని ఇంగ్లాండ్ సిరీస్‌కు ఎంపిక చేసే అవకాశం లేదట. తాజాగా మహ్మద్ షమీ ఫిట్‌నెస్‌పై బీసీసీఐ వైద్య బృందం బోర్డుకు అప్‌డేట్ ఇచ్చింది. షమీ లాంగ్ స్పెల్స్ బౌలింగ్ చేయలేడని వైద్య బృందం నిర్ధారించింది. ఈ నేపథ్యంలో సెలెక్టర్లు షమీ విషయంలో రిస్క్ తీసుకోవాలనుకోవట్లేదు. అయితే దీనికి సంబంధించి అఫిషియల్ ప్రకటన లేనప్పటికీ త్వరలో బీసీసీఐ నిర్ణయం ప్రకటించనుంది. మరోవైపు జస్ప్రీత్ బుమ్రా విషయంలో సెలెక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ సిరీస్ సందర్భంగా జస్ప్రీత్ బుమ్రా గాయపడ్డాడు. దీని కారణంగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఆడలేకపోయాడు. ప్రస్తుతం ఐపీఎల్‌లో రాణిస్తున్నప్పటికీ, ఇంగ్లాండ్‌తో జరిగే ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ విషయంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకోనుంది. ఈ టూర్లో బుమ్రాని అన్ని మ్యాచ్ లలో ఆడించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నది. నివేదికల ప్రకారం జస్ప్రీత్ బుమ్రా కేవలం మూడు మ్యాచ్‌లలో మాత్రమే పాల్గొంటాడు. ఇదే జరిగితే ఇంగ్లీష్ గడ్డపై టీమిండియా గెలవడం కష్టంగానే కనిపిస్తుంది.

# సినిమా చిత్రం




## మూవీ రివ్యూ : ఏస్

'ఏస్' మూవీ రివ్యూ

నటీనటులు: విజయ్ సేతుపతి-రుక్మిణి వసంత్-యోగి బాబు-దివ్య పిళ్ళై-అవినాష్-పృథ్వీ తదితరులు

సంగీతం: సామ్ సీఎస్

ఛాయాగ్రహణం: కరణ్ రావత్

రచన-దర్శకత్వం-నిర్మాణం: ఆర్ముగ కుమార్

తెలుగు రిలీజ్ : శ్రీ పద్మిని సినిమాస్ బి. శివ ప్రసాద్.

ఓవైపు క్యారెక్టర్.. విలన్ పాత్రలతో అలరిస్తూనే అప్పుడప్పుడూ హీరోగానూ మెరుస్తుంటాడు తమిళ నటుడు విజయ్ సేతుపతి. గత ఏడాది అతడి నుంచి వచ్చిన 'మహారాజా' ఎంత పెద్ద హిట్ అయిందో తెలిసిందే. ఇప్పుడతను కథానాయకుడిగా 'ఏస్' అనే సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తమిళంతో పాటు తెలుగులోనూ ఒకేసారి విడుదలైన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.

కథ:

బోల్ట్ కాశి (విజయ్ సేతుపతి) ఉపాధి కోసం మలేషియాకు వెళ్లి అక్కడ తనకు తగ్గ పని కోసం చూస్తుంటాడు. అతడికి అనుకోకుండా పరిచయం అయిన రుక్మిణి (రుక్మిణి వసంత్)తో అతను ప్రేమలో పడతాడు. కొన్ని రోజుల తర్వాత రుక్మిణి కూడా అతణ్ని ఇష్టపడుతుంది. ఓ సమస్యలో ఉన్న రుక్మిణిని ఆదుకోవడం కోసం పేకాట ఆడిన కాశి.. కోటి రూపాయల బకాయి పడతాడు. ఆ అప్పు తీర్చడానికి ఇంకా పెద్ద రిస్క్ చేయడానికి సిద్ధపడతాడు కాశి. ఇంతకీ అతను చేయాలనుకున్న రిస్క్ ఏంటి.. ఆ పని విజయవంతంగా పూర్తి చేశాడా.. తనతో పాటు రుక్మిణి సమస్య తీరిందా లేదా అన్నది మిగతా కథ.

కథనం-విశ్లేషణ:

మామూలు పాత్రలను కూడా తన పెర్ఫామెన్సుతో ప్రత్యేకంగా మార్చే నటుడు విజయ్ సేతుపతి. తనకు మంచి పాత్ర.. విషయం ఉన్న కథ పడితే ఆ సినిమాను వేరే స్థాయికి తీసుకెళ్లిపోతాడు. 'మహారాజా' సినిమాలో అదే జరిగింది. పేపర్ మీద చూస్తే 'ఏస్' కథ.. సేతుపతి పాత్ర కూడా ఆసక్తికరంగానే అనిపిస్తాయి. బతుకు తెరువు కోసం వేరే దేశానికి వెళ్లి వ్యక్తి.. ఒక సమస్య నుంచి బయటపడ్డానికి తప్పు చేసి.. ఆ తర్వాత దాన్ని కవర్ చేయడానికి ఇంకా పెద్ద తప్పు చేసి పెద్ద విష వలయంలో చిక్కుకోవడం.. చివరికి తన తెలివితేటలు ఉపయోగించి మొత్తం సమస్య నుంచి బయటపడడం.. ఇదీ స్థూలంగా 'ఏస్' కథ. చిన్న నిప్పు రవ్వతో మొదలై పెద్ద కార్చిచ్చుగా మారడం.. ఈ లైన్లో నడిచే స్టోరీ ప్రేక్షకుల్లో కొంత క్యూరియాసిటీ రేకెత్తిస్తుంది. కానీ ఎగుడు దిగుడుగా సాగే కథనం వల్ల 'ఏస్' పూర్తి సంతృప్తినిచ్చే సినిమాగా రూపుదిద్దుకోలేకపోయింది. కొన్ని ఎపిసోడ్ల వరకు ఓకే అనిపించినా.. అంతిమంగా మిశ్రమానుభూతినే మిగులుస్తుంది.'ఏస్' క్రైమ్ ఎలిమెంట్స్ చుట్టూ తిరిగే కథ. ఇందులో హీరో పెద్ద దొంగతనం చేస్తాడు. అతణ్ని పట్టుకోవడానికి ఇటు పోలీసులు.. అటు రౌడీ గ్యాంగులు ప్రయత్నిస్తుండగా క్యాట్ అండ్ మౌస్ గేమ్ లాగా సినిమా నడుస్తుంది. ఐతే మలేషియా లాంటి అభివృద్ధి చెందిన దేశంలో పట్ట పగలు ఏటీఎంలో డబ్బులు నింపే వాహనం నుంచి హీరో కోట్ల రూపాయలు కొట్టేస్తాడు. అత్యున్నత స్థాయి పోలీస్ విభాగం, అధునాత టెక్నాలజీ ఉండి కూడా అతణ్ని పట్టుకోలేకపోవడమే విడ్డూరంగా అనిపిస్తుంది. కథలో అత్యంత కీలకమైన ఇలాంటి ఎపిసోడ్లు తీసేటపుడు.. సన్నివేశాలు పకడ్బందీగా ఉండేలా చూసుకోవాలి. తెర మీద జరిగేదంతా ప్రేక్షకులకు కన్విన్సింగ్ గా అనిపించాలి. కానీ ఈ సినిమాలో అవే మిస్ అయ్యాయి. హీరో చాలా సింపుల్ గా దొంగతనం చేసేస్తాడు. అంతే సింపుల్ గా పోలీసుల నుంచి తప్పించుకుంటాడు. తన కోసం పోలీసులు పెద్ద ఎత్తున వెతుకుతున్నా.. ఓ దశలో అడ్డంగా దొరికిపోయినా.. తనలో రవ్వంతైనా టెన్షన్ కనిపించదు. అలా అని అతను వేసే ప్లాన్లు ఏమైనా అద్భుతంగా ఉంటాయా అంటే అదీ లేదు. గాలి వాటంగా ఏదో చేసుకుపోతుంటాడు. ఇలా కన్వీనియెంట్ గా సన్నివేశాలు రాసుకోవడంతో 'ఏస్' ఇంపాక్ట్ తగ్గిపోయింది. కానీ సేతుపతి మాత్రం తన పెర్ఫామెన్సుతో వీలైనంతగా ఎంగేజ్ చేయడానికి ప్రయత్నించాడు. తనతో ముడిపడ్డ కొన్ని సన్నివేశాలు ఆసక్తికరంగా సాగడంతో సినిమా మరీ బోర్ అయితే కొట్టించదు. ఓవరాల్ గా 'ఏస్' ఇంపాక్ట్ తగ్గినా.. కొన్ని ఎపిసోడ్ల వరకు ఆసక్తికరంగా అనిపిస్తాయి. ప్రథమార్ధంలో వచ్చే పేకాట ఎపిసోడ్ ప్రేక్షకులను అలరిస్తుంది. ఆ ఎపిసోడ్లో ఉన్న ఉత్కంఠకు తోడు.. యోగిబాబు కామెడీ ఆకట్టుకుంటాయి. ఆరంభ సన్నివేశాలు సాధారణంగా అనిపించినా.. ఈ ఎపిసోడ్ దగ్గర కథనం ఊపందుకుంటుంది. ఆ తర్వాత కథలో అనేక మలుపులు వస్తాయి. దొంగతనం ఎపిసోడ్ అంత కన్విన్సింగ్ గా లేకపోయినా.. చివరి అరగంటలో రేసీగా సాగే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. క్లైమాక్సే సినిమాకు బలం. ఆఖర్లో హీరో ఆడే గేమ్ ప్రేక్షకులకు కిక్కిస్తుంది. చివరికి హీరో గెలుస్తాడు అన్నది కామనే అయినా.. ఇక్కడ కూడా కన్వీనియెంట్ గా సన్నివేశాలను రాసుకున్నా.. క్లైమాక్స్ మెప్పిస్తుంది. దర్శకుడు ఆఖర్లో చూపించిన షార్ప్ నెస్.. కథనంలో వేగం ముందు కూడా ఉండి ఉంటే 'ఏస్' జనరంజకమైన సినిమా అయ్యుండేది. రెండున్నర గంటలు ఏదో అలా టైంపాస్ చేయాలనుకుంటే.. విజయ్ సేతుపతి పెర్ఫామెన్స్ చూడాలనుకుంటే 'ఏస్'పై ఓ లుక్కేయొచ్చు కానీ.. అంతకుమించి ఆశిస్తే కష్టం.

నటీనటులు:

సేతుపతి నటనకు వంకలు పెట్టడానికేమీ లేదు. బలహీనమైన కథను వీలైనంత మేర నిలబెట్టడానికి అతను కృషి చేశాడు. ఎక్కువ హడావుడి చేయకుండానే ప్రభావవంతంగా నటిస్తూ ప్రేక్షకులను ఎంగేజ్ చేశాడు సేతుపతి. హీరోయిన్ రుక్మిణి వసంత్ ఓకే. కొన్ని సన్నివేశాల్లో కళ్లతో బాగా నటించింది. యోగిబాబు కామెడీ సినిమాలో పెద్ద రిలీఫ్. తన మార్కు నటనతో నవ్వించాడు. దివ్యా పిళ్ళై కూడా బాగానే చేసింది. సీనియర్ నటుడు పృథ్వీ పాత్ర గందరగోళంగా అనిపిస్తుంది. ఆ పాత్రను సరిగా తీర్చిదిద్దలేదు. తన నటన పర్వాలేదు. 'కేజీఎఫ్' ఫేమ్ అవినాష్.. మిగతా నటీనటులంతా మామూలే.

సాంకేతిక వర్గం:

టెక్నికల్ గా 'ఏస్' ఏమంత గొప్పగా అనిపించదు. సామ్ సీఎస్ పాటలు పెద్దగా ఆకట్టుకోవు. నేపథ్య సంగీతం మాత్రం సన్నివేశాలను కొంతమేర ఎలివేట్ చేసింది. కరణ్ రావత్ సినిమాటోగ్రఫీలో మెరుపులేమీ లేవు. నిర్మాణ విలువలు పర్వాలేదు. శ్రీ పద్మిని సినిమాస్ బి. శివ ప్రసాద్ తెలుగు లో రిలీజ్ చేసారు . రైటర్ కమ్ డైరెక్టర్ ఆర్ముగ కుమార్ రాసుకున్న కథలో విషయం ఉన్నా.. దాన్ని తెర మీద సరిగా ఎగ్జిక్యూట్ చేయలేకపోయాడు. థ్రిల్లర్ కథలకు రేసీ స్క్రీన్ ప్లే.. పకడ్బందీ సీన్లు ఉంటేనే పండుతాయి. ఆర్ముగ కుమార్ చాలా వరకు కన్వీనియెంట్ రైటింగ్ తో సినిమా గ్రాఫ్ తగ్గించేశాడు. కొన్ని ఎపిసోడ్ల వరకు అతను మెప్పించినా.. ఓవరాల్ గా అతడికి యావరేజ్ మార్కులే పడతాయి.

చివరగా: ఏస్.. సోసో థ్రిల్లర్

రేటింగ్- 2.5/5




## విశ్వంభర రిలీజ్ నెలాఖరుకా?




విశ్వంభర రిలీజ్ నెలాఖరుకా? 'విశ్వంభర' రిలీజ్ విషయంలో ఇంకా క్లారిటీ లేని సంగతి తెలిసిందే. సంక్రాంతికి రిలీజ్ ప్రకటించిన సినిమా ఇప్పటి వరకూ మరో రిలీజ్ తేదిని ప్రకటించకపోడంతో? రిలీజ్ ఎప్పుడు అనే ఒత్తిడి మేకర్స్ మీద మొదలైంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు డిలే కారణంగా రిలీజ్ వాయిదా పడుతుందనే విషయం వెలుగులోకి వచ్చినా? ఆ పనులు ఎంతకీ ముగింపు వచ్చినట్లు కనిపించలేదు. సంక్రాతి గడిచి ఐదు నెలలవుతుంది. అప్పటి నుంచి పెండింగ్ షూట్ తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ కూడా జరుగుతుంది. నేటికి కూడా పోస్ట్ ప్రొడక్షన్ ఎంత వరకూ పూర్తయిందన్నది క్లారిటీ లేదు. దీంతో రిలీజ్ తేదీపై ఆసక్తి సన్నగిల్లుతుంది. జూన్..జూలై ..ఆగస్టు అంటూ ప్రచారం జరుగుతుంది . మరోవైపు దసరా సందర్భంగా అక్టోబర్ లో రిలీజ్ అవుతుందనే ప్రచారం కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో రిలీజ్ తేదిపై స్పష్టత వచ్చేదెప్పుడు? అంటే ఈ నెలఖరుకల్లా మేకర్స్ క్లారిటీ ఇచ్చే అవకాశం ఉందని చిత్ర వర్గాల నుంచి లీకైంది. %యాశ్రీంశీ =ముం% - సందీప్‌రెడ్డి వంగకు ఈ యాటిట్యూడ్ ఉండాల్సిందే? ఏ నెలలో రిలీజ్ చేస్తారన్నది తేదీతో సహా ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి చెప్పే అవకాశం ఉందంటున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఓకొలిక్కి వచ్చాయంటున్నారు. మరి ఇందులో నిజమెంత? అన్నది మేకర్స్ ధృవీకరించాల్సి ఉంది. మరోవైపు చిరంజీవి కొత్త సినిమా పనుల్లో బిజీ అవ్వడానికి రెడీ అవుతున్నారు. అనీల్ రావిపూడి దర్శకత్వం వహించనున్న 157వ సినిమా కోసం మెగాస్టార్ ఎంతో ఎగ్జైట్ మెంట్ తో సెట్స్ లో కాలు పెట్టడానికి రెడీ అవుతున్నారు. చాలా కాలం తర్వాత చిరంజీవి నటించబోతున్న కామెడీ ఎంటర్ టైనర్ కావడంతో బాస్ అంత ఎగ్జైట్ మెంట్ తో ఉన్నారు. ఈ నేపథ్యంలో 'విశ్వంభర'కు సంబంధించి అన్ని పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయనా సిద్ధంగా ఉన్నారు. రిలీజ్ తేదీని పట్టి ప్రచారం పనులను ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుంది.


## బన్నీ కోసం అట్లీ ఐదుగురిని ఫిక్స్ చేస్తున్నాడా?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ - అట్లీ కాంబోలో భారీ పాన్ వరల్డ్ మూవీకి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అత్యంత భారీ స్థాయిలో హాలీవుడ్ టెక్నీషియన్స్ అండ్ ఆర్టిస్టలతో ఈ భారీ ప్రాజెక్ట్‌ని అత్యంత ప్రతిష్టాత్మకంగా దర్శకుడు అట్లీ తెరపైకి తీసుకొస్తున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రస్తుతం జరుగుతోంది. ఇటీవలే హైదరాబాద్ వచ్చిన అట్లీ ఈ పనులను ప్రారంభించారు. హాలీవుడ్ సూపర్ హీరోల చిత్రాలకు ఏ మాత్రం తీసిపోని స్థాయిలో తెరకెక్కనున్న ఈ సినిమాలో బన్నీ మూడు విభిన్నమైన పాత్రల్లో కనిపించబోతున్నారు. మూడు వేరు వేరు ప్రపంచాల్లో జరిగే కథగా దీన్ని అట్లీ రూపొందిస్తున్నారు. ఈ సినిమా కోసం బన్నీకి జోడీగా పాపులర్ స్టార్స్ నటిస్తారంటూ కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. విజువల్స్ ఎఫెక్ట్స్‌కి పెద్ద పీట వేస్తున్న అట్లీ గ్లామర్ పరంగానూ జాగ్రత్తలు తీసుకుంటున్నాడట. ఇందులో భాగంగానే ఈ మూవీ కోసం ఏకంగా ఐదుగురు క్రేజీ హీరోయిన్‌లని ఫైనల్ చేస్తున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇందులో ముందుగా బాలీవుడ్ క్రేజీ లేడీ దీపికా పదుకునే పేరు వినిపిస్తోంది. దీపికతో పాటు మృణాల్ ఠాకూర్, అనన్య పాండే, జాన్వీ కపూర్, భాగ్యశ్రీ బోర్సేలని కూడా సెలెక్ట్ చేయ బోతున్నాడట. ఈ క్రేజీ కాస్టింగ్‌తో ఈ ప్రాజెక్ట్ హాట్ టాపిక్ కావాలన్నది అట్లీ ఆలోచనగా తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించి ఇంత వరకు ఎలాంటి అధికారిక ప్రకటన లేనప్పటికీ ఈ ఐదుగురు ఈ ప్రాజెక్ట్‌లో ఉంటారని మాత్రం ఇన్ సైడ్ టాక్. అయితే దీపిక పదుకునే విషయంలోనే అందరిలో అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి.

ఇటీవల షరతుల కారణంగా సందీప్‌రెడ్డి వంగ ప్రాజెక్ట్ %-%స్పిరిట్%-% నుంచి తప్పుకున్న దీపికని కంట్రోల్ చేయడం అట్లీకి వీలవు తుందా? అని అంతా చర్చించుకుంటున్నారు. అయితే మరి కొంత మంది మాత్రం %-%జవాన్%-%లో దీపికతో కలిసి వర్క్ చేసిన అట్లీకి అది పెద్ద మ్యాటరే కాదని, దీపికని తను కట్రోల్ చేయగలడని అంటు న్నారు. మరి ఈ వార్తల్లో ఉన్న నిజమెంత అన్నది తెలియాలంటే టీమ్ అధి కారికంగా స్పందించేంత వరకు వేచి చూడా ల్సిందే.

## నెవ్వర్ బిఫోర్ అనేలా స్పై పాప గ్లామర్ ఎటాక్..



తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ ఐశ్వర్య మెనన్ సోషల్ మీడియాలో మళ్లీ హాట్ టాపిక్ అవుతోంది. తెల్లటి టాప్, షార్ట్ ప్యాంట్‌లో స్టన్నింగ్ లుక్‌తో పోజులిచ్చిన ఈ లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. 'గ్రేస్ ఇన్ ఎవరీ గ్లాన్స్, పీస్ ఇన్ ఎవరీ బ్రీత్' అనే క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ స్టిల్స్‌కి అభిమానుల నుంచి భారీ రెస్పాన్స్ వస్తోంది. ఐశ్వర్య మెనన్ కెరీర్ విషయానికి వస్తే.. 2012లో తమిళ సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె తరువాత కేవలం గ్లామర్‌కు పరిమితం కాకుండా, ప్రామాణికమైన పాత్రలతోనూ మెప్పిస్తోంది. కన్నడ తెలుగులో నటించి ఆకట్టుకుంది. తెలుగులో ఆమధ్య స్పై, భజే వాయు వేగం వంటి సినిమాలలో మంచి పాత్రలు చేసింది. అయితే ఆమెకు భారీ మార్కెట్ ఉండకపోయినా, తన సొగసుతో, హావభావాలతో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది. తాజాగా షేర్ చేసిన ఫోటోల్లో ఆమె చూపించిన స్టైలింగ్, హేర్‌స్టైల్, ఎక్స్‌ప్రెషన్స్ అన్నీ పర్‌ఫెక్ట్‌గా ఉండటమే కాకుండా, యూత్‌ను విపరీతంగా ఆకట్టు కుంటు న్నాయి. తెల్లటి కాస్ట్యూమ్‌లో ఆమె చూపించిన క్యాషువల్ యెట్ గ్లామరస్ లుక్‌కి వావ్ అంటున్నారు నెటిజన్లు. నేచురల్ లైటింగ్‌లో తీసిన ఈ ఫోటోలు ఐశ్వర్య మెనన్ అందాన్ని మరో లెవెల్‌లో చూపిస్తున్నాయనడం అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ఆమె తమిళ, తెలుగు చిత్రాలతో పాటు ఓ వెబ్ సిరీస్ ప్రాజెక్ట్‌లోనూ బిజీగా ఉంది. కొంతకాలంగా సరైన హిట్ లేక పోయినా.. సోషల్ మీడియా పాపులారిటీతో మళ్లీ అవకాశాలు అందుకుం టోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పోస్ట్ చేసిన ప్రతి ఫోటోకి వేల సంఖ్యలో లైక్స్, కామెంట్లు రావడం గమనించదగ్గ విషయం. ఐశ్వర్య మెనన్ కెరీర్ పుంజుకోవడం కోసం మంచి స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తోంది. ఇక ఫ్యాషన్, ఫొటోషూట్‌లతో యూత్‌ను కట్టిపడేస్తోంది.

## 40 ఏజ్‌లోను ఇషా గుప్తా స్టన్నింగ్ లుక్



అందాల ప్రదర్శన అనేది ఒక కళ.. అందం ఎంత ఉన్నా అందంగా ప్రదర్శించడం తెలియాలి! ఈ విషయంలో ఇషా గుప్తా ఇతర భామల కంటే, నాలుగు ఆకులు ఎక్కువే తింది. నేటితరం కథానాయికల నుంచి పోటీ ఎంత ఉన్నా కానీ, ఇండస్ట్రీలో తనదైన ప్రత్యేకతను నిలుపుకునేందుకు ఇషాజీ ఈ ఏజ్ లోను ఎంతగా పాకులాడుతుందో తన ఇన్‌స్టా చూస్తే ఎవరైనా చెప్పగలరు. ఫ్యాషన్ ఇండస్ట్రీ దేవతగా పాపులరైన ఇషా గుప్తా అందాల పోటీల జడ్జిగాను గౌరవాన్ని అందుకున్నారు. భారతదేశంలో ప్రతిభావంతులైన మోడల్స్ ని తయారు చేయడంలోను



తనకు అపారమైన అనుభవం ఉంది. అందుకే సినీపరిశ్రమలోను ఇషా గుప్తాకు ఉన్న గుర్తింపు అంతా ఇంతా కాదు. అయితే కొంతకాలంగా నటనా కెరీర్ పరంగా ఇషా గుప్తా స్పీడ్ తగ్గింది. చాలా రేర్ గా మాత్రమే తెరపై కనిపిస్తున్నారు. అయినా తన అభిమానులను నిరాశపరచకుండా, వరుస ఫోటోషూట్లను సోషల్ మీడియాల్లో షేర్ చేస్తున్నారు. ఇషా గుప్తా షేర్ చేసిన తాజా ఫోటోషూట్ ఇంటర్నెట్ లో ట్రెండింగ్‌గా మారింది. అంతగా ప్రత్యేకత ఏం ఉంది? అంటే... ఏజ్ లెస్ బ్యూటీ వయసు 40 బార్డర్ లో ఉన్నా కానీ, తనలో వేడి ఎంతమాత్రం తగ్గలేదని నిరూపిస్తోంది. ఇషా గుప్తా లేటెస్ట్ బోల్డ్ ఫోటోషూట్ తో ఇంటర్నెట్ లో అగ్గి రాజేస్తోంది. బాడీ హగ్గింగ్ ఇన్నర్ ని ధరించిన ఇషా బోలి లుక్ లో చెలరేగిపోయింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ని యూత్ అంతర్జాలంలో వైరల్ గా షేర్ చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. రామ్ చరణ్ సినిమాలో ఒక ఐటమ్ నంబర్ లోను నర్తించి తెలుగు వారికి సుపరిచితమై. కానీ తెలుగులో ఈంది ఈ భామ. కానీ ఇప్పుడు నటిగా అవకాశాలు రాలేదు. హిందీ చిత్రసీమలో హౌస్ ఫుల్ 5 లో నటిస్తోంది.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh, epaper. www.saisuryaa.com.saisuryaadaily @gmail.com